# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :242 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: ఆదివారం 01-12-2024 | పేజీలు:4 వెల: 2.00


### ఇద్దరు గగనయాత్రికుల ప్రాథమిక శిక్షణ పూర్తి : ఇస్రో

బెంగుళూరు: అమెరికా అంతరిక్ష శిక్షణా కేంద్రం నాసా, భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో ఆధ్వరంలో.. ఇద్దరు భారతీయ వ్యోమగాములు అమెరికాలో శిక్షణ పొందుతున్నారు. అయితే ఆ ఇద్దరికి చెందిన ప్రాథమిక శిక్షణ పూర్తి అయినట్లు ఇస్రో ప్రకటించింది. ప్రైమ్ గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా, బ్యాకప్ గ్రూపు కెప్టెన్ ప్రశాంత్ బాలకృష్ణ నాయర్ .. అమెరికాలో శిక్షణ పొందుతున్నారు. ఏక్సియమ్ మిషన్ 4 కోసం ఈ ఏడాది ఆగస్టు నుంచి వాళ్లు శిక్షణలో ఉన్నట్లు ఇస్రో తెలిపింది. ఇద్దరు గగనయాత్రికుల ప్రాథమిక శిక్షణ విజయవంతంగా పూర్తి అయినట్లు ఇస్రో పేర్కొన్నది. ఆ శిక్షణ సమయంలో.. మిషన్ సంబంధిత గ్రౌండ్ ఫెసిలిటీ టూర్స్, మిషన్ లాంచ్ ఫేస్, స్పేస్ఎక్స్ సూట్ ఫిక్స్ చెక్స్, ఫుడ్ ఆప్షన్స్ గురించి శిక్షణ తీసుకున్నారు. స్పేస్ఎక్స్ డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్ గురించి కూడా భారతీయ వ్యోమగాములు శిక్షణ పొందారు. అంతరిక్షంలో ఏర్పడే అత్యవసర పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలన్న అంశంపై తొలి దశ శిక్షణలో తెలిపారు.

## ఇది నెంబర్ కాదు.. రైతులు మాపై పెట్టుకున్న నమ్మకం..



హైదరాబాద్, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తరువాత 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలోకిరాగా.. పదేళ్లు అధికారంలోనే కొనసాగింది. 2023 డిసెంబర్ నెలలో వెలువడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో తెలంగాణలో తొలిసారి కాంగ్రెస్ అధికార పీఠాన్ని అదిరోహించిన విషయం తెలిసిందే. 2023 డిసెంబర్ 7న సీఎం రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. అయితే, మరికొద్ది రోజుల్లో తెలంగాణ సర్కార్ ఏర్పడి ఏడాది కాబోతుంది. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎనిమిది రోజులపాటు సంబరాలు నిర్వహిస్తోంది. ఇదిలాఉంటే.. అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ గతేడాది ఇదేరోజున జరిగింది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన 'ఎక్స్' ఖాతా వేదికగా ఆసక్తికర విషయాలను ప్రస్తావిస్తూ పోస్టు చేశారు.రేవంత్ ట్వీట్ ప్రకారం.. ఏడాది క్రితం సరిగ్గా ఇదేరోజు పొలానికి వెళ్లి అరక కట్టాల్సిన రైతు పోలింగ్ బూతుకు వెళ్లి "మార్పు" కోసం ఓటేశాడు. ఆ ఓటు అభయహస్తమై రైతన్న చరిత్రను తిరగరాసింది. ఏకకాలంలో 2 లక్షల రుణమాఫీ చేయడంతోపాటు.. రూ.7,625 కోట్ల రైతు భరోసా, ధాన్యానికి క్వింటాల్ కు రూ.500 బోనస్, రూ.10,444 కోట్ల ఉచిత విద్యుత్, రూ.1433 కోట్ల రైతుబీమా, రూ.95 కోట్ల పంట నష్ట పరిహారం, రూ.10,547 కోట్ల ధాన్యం కొనుగోళ్లు చేయడం జరిగిందని రేవంత్ అన్నారు. కాంగ్రెస్ హయాంలో ఒక్క ఏడాదిలో 54వేల కోట్ల రూపాయలతో రైతుల జీవితాల్లో పండగ తెచ్చాంమని అన్నారు. ఇది నెంబర్ కాదు.. రైతులు మాపై పెట్టుకున్న నమ్మకం అని రేవంత్ పేర్కొన్నారు. ఈ సంతోష సమయంలో అన్నదాతలతో కలిసి రైతు పండుగలో పాలు పంచుకోవడానికి ఉమ్మడి పాలమూరుకు వస్తున్నా అంటూ రేవంత్ రెడ్డి ట్వీట్ లో పేర్కొన్నారు.

## రైతుబంధును శాశ్వతంగా బంద్ పెట్టేందుకు కాంగ్రెస్ సర్కార్ కుట్ర



హైదరాబాద్: సాగుకు పెట్టుబడి సాయం అందించి రైతన్నకు భరోసా కల్పించిన రైతుబంధు పథకాన్ని శాశ్వతంగా బంద్ పెట్టే కుట్రకు కాంగ్రెస్ ప్రభుత్వం తెర లేపడం సిగ్గుచేటని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. రైతుబంధు కంటే సన్నాలకిచ్చే రూ.500 బోనసే మేలని రైతులు చెబుతున్నట్టు వ్యవసాయ శాఖ మంత్రి చెప్పడం శోచనీయమన్నారు. ప్రపంచంలో రైతుకు పెట్టుబడి సాయం అందించిన ఏకైక పథకం రైతుబంధు అని ఐక్యరాజ్య సమితి సైతం ప్రశంసి ంచిందని గుర్తుచేశారు. అలాంటి గొప్ప పథకాన్ని ఒక ప్రణాళిక ప్రకారం రూపుమాపే ప్రయత్నం చేస్తుండడం దుర్మార్గమని విమర్శించారు. రాష్ట్రంలో 1.53 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తే 5,19,605 క్వింటాళ్ల సన్న వడ్లను క్వింటాలుకు రూ.500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేసినట్లు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఈ లెక్కన రైతులకు దక్కిన బోనస్ సుమారు రూ.26 కోట్లు మాత్రమేనని చెప్పారు. అదే రైతుబంధు కింద ఏడాదికి రూ.7500 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంటుందని వెల్లడించారు.కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో చెప్పినట్లు ఎకరాకు రూ.15 వేలు చెల్లిస్తే ఇది ఇంకా ఎక్కువ అవుతుందని తెలిపారు. మరి రైతు బంధు కంటే, బోనస్ అందించడం రైతులకు మేలు ఎట్లవుతుందో వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి రాగానే రుణమాఫీ సగం మందికి చేసి, సగం మందికి మొండి చేయి చూపారని విమర్శించారు. ఆ తర్వాత అన్ని పంటలకు బోనస్ అని, చివరకు సన్నాళ్లకు మాత్రమే పరిమితం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు రైతుబంధును శాశ్వతంగా రద్దు చేసే ప్రయత్నం మొదలుపెట్టారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతుబంధును బందు చేస్తారని కేసీఆర్ గారు ముందే హెచ్చరించారని గుర్తుచేశారు. అనుకున్నట్టే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేస్తున్నదని చెప్పారు.రైతు భరోసా వస్తదని ఎదురుచూస్తున్న రైతులు, కౌలు రైతులు, ఉపాధి కూలీలు మోసపోయినట్లేనా అని ప్రశ్నించారు. రైతులను విజయవంతంగా మోసం చేసినందుకు రైతు పండుగ నిర్వహిస్తున్నావా రేవంత్ రెడ్డి అని నిలదీశారు. మేనిఫెస్టోలో చెప్పి, రైతులను నమ్మించి అధికారంలోకి వచ్చాక దగా చేసినందుకు విజయోత్సవాలా రేవంత్ రెడ్డి అని దుయ్యబట్టారు. రైతుల బతుకులు మార్చేందుకు కేసీఆర్ తీసుకొచ్చిన రైతు బంధు పథకాన్ని నిలిపివేసే కుట్రను బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నదని చెప్పారు. శనివారం మహబూబ్‌నగర్‌లో నిర్వహించే కార్యక్రమంలో రైతు బంధు అమలుపై స్పష్టత ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న వానకాలం రైతుబంధుతో పాటు, యాసంగికి పంట పెట్టుబడి సాయం వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## షాకివ్వనున్న బీజేపీ..మహారాష్ట్ర సీఎంగా కొత్త ముఖం..



ముంబై:గత ఏడాది ఎన్నికలు జరిగిన మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్ గఢ్ లలో మూడుచోట్లా బీజేపీనే నెగ్గింది. అప్పటికి ఆయా రాష్ట్రాల్లో శివరాజ్ సింగ్ చౌహాన్, వసుంధర రాజే, రమణ్ సింగ్ వంటి మాజీ సీఎంలను కాదని కొత్త ముఖాలను తెరపైకి తెచ్చింది. దీంతో అందరూ ఆశ్చర్యపోయారు. లోక్ సభ ఎన్నికల ముంగిట ఇలాంటి నిర్ణయాలు ఏమిటని నోరెల్లబెట్టారు. ఇది బెడిసికొట్టడం ఖాయం అని అనుకున్నారు. మధ్యప్రదేశ్ వంటి పెద్ద రాష్ట్రంలో బీసీ వర్గానికి చెందిన మోహన్ యాదవ్ ను, ఛత్తీస్ గఢ్ లో ఎస్టీ అయిన విష్ణుదేవ్ సాయిని, రాజస్థాన్ లో అగ్రవర్ణాలకు చెందిన భజన్ లాల్ శర్మను సీఎం పీఠంపై కూర్చోబెట్టింది. మరి తాజాగా జరిగిన మహారాష్ట్ర ఎన్నికల్లో అఖండ విజయం సాధించిన తర్వాత ఏం చేయబోతోంది...?

శిందే కాదు.. ఫడణవీస్ వద్దు..

మహారాష్ట్రలో గత శనివారం ఫలితాలు వెలువడ్డాయి. నవంబరు 26 తోనే ఆ రాష్ట్ర అసెంబ్లీ గడువు ముగిసింది. ఆపద్ధర్మ సీఎంగా ఏక్ నాథ్ శిందే కొనసాగుతు న్నారు. అయితే, మహాయుతి కూటమిలో 132 సీట్లు సాధించి అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించిన బీజేపీ ఈ సారి సీఎం పీఠం తమదేనని అన్యాపదేశంగా స్పష్టం చేసింది. శిందే మాత్రం హోం శాఖతో కూడిన డిప్యూటీ సీఎం పదవిని కోరుతున్నారు. చర్చలు ఎటూ తెగకపోవడంతో ఆయన స్వగ్రామం వెళ్లిపోయారనే కథనాలు వస్తున్నాయి. ఇక మాజీ సీఎం దేవేంద్ర ఫడణవీస్ తాజా ఎన్నికల్లో బీజేపీ గెలుపులో కీలక పాత్ర పోషించారు. ఈయన అభ్యర్థిత్వానికి ఎన్సీపీ నాయకుడు అజిత్ పవార్ మద్దతిస్తున్నారు. ఫడణవీస్ అభ్యర్థిత్వంపై మొదటినుంచి బీజేపీ సానుకూలంగానే ఉంది. అయితే, తాజాగా కొత్త పేరు తెరపైకి వచ్చింది.

శిందే శివాలు

సీఎం, శాఖల కేటాయింపులపై మహాయుతి పార్టీల మధ్య చర్చలు కొలిక్కిరాకపోవడంతో శిందే అసహనంతో ఉన్నట్లు సమాచారం. ఆయన కూటమి ముఖ్య నేతల సమావేశాన్ని రద్దు చేసుకుని స్వగ్రామం వెళ్లిపోయారు. దీంతో శివసేన నేత సంజయ్ శిర్సత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కొత్త ప్రభుత్వంలో శిందేను పక్కనబెడుతున్నారని ఆరోపించారు. సీఎం ఎవరనే దానిపై బీజేపీ నిర్ణయానికి పూర్తి మద్దతిస్తానని చెప్పిన శిందే.. ముంబయిలో కూటమి నేతల చర్చల తర్వాత రెండు, మూడు రోజుల్లో నిర్ణయాన్ని ప్రకటిస్తాం అని అన్నారు. కానీ, తర్వాత గంటల్లోనే సమావేశాన్ని రద్దు చేసి సొంతూరు వెళ్లిపోయారు. ఆయన అసంతృప్తిగా ఉన్నారని స్పష్టం అవుతోందని చెబుతున్నారు. అయితే, అనారోగ్య సమస్యలతో ఊరికి వెళ్లినట్లు మరికొందరు నేతలు తెలిపారు.

24 గంటల్లో ప్రకటన.. సీఎంగా మురళీధర్..?

భవిష్యత్తు కార్యాచరణపై శిందే 24 గంటల్లో కీలక ప్రకటన చేసే అవకాశం ఉ ందని సమాచారం. మహాయుతిలో ఉంటారా? లేదా? అనే అనుమానాలు వస్తున్నాయి. కొత్త సీఎం ఫడణవీస్ కాదని మురళీధర్ మోహోల్ రేసులో ఉ న్నారని తెలుస్తోంది. ఈయన పుణె ఎంపీ. ప్రస్తుతం కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రిగా ఉన్నారు.

## టైగర్ టెన్షన్.. ఆసిఫాబాద్ జిల్లాలోని ఆ గ్రామాల్లో 144 సెక్షన్



ఆసిఫాబాద్: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పులి సంచారం కలకలం సృష్టిస్తున్నది. గత కొన్నిరోజులుగా పశువుల మందలపై దాడులు చేస్తున్న పులి.. శుక్రవారం ఉదయం ఓ యువతిని చంపేసింది. కాగజ్‌నగర్ మండలం గన్నారంలో ఉదయం 8.30 గంటల సమయంలో పత్తి ఏరుతున్న మోర్లె లక్ష్మిపై దాడి చేసింది. దీంతో ఆమె తీవ్రంగా గాయపడి మృతిచెందింది. ఈ నేపథ్యంలో అటవీ శాఖ అధికారులు అలర్ట్ అయ్యారు. దాడి జరిగిన ప్రాంతానికి దగ్గరలోనే పులి సంచరిస్తున్నట్లు నిర్ధరించారు. ఈ నేపథ్యంలో కాగజ్‌నగర్ మండలంలోని పలు గ్రామాల్లో ఆంక్షలు విధించారు. ఈజ్గాం, నజ్రూల్ నగర్, సీతానగర్, అనుకోడా, గన్నారం, కడంబా, ఆరెగూడ, బాబూనగర్, చింతగూడ గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. ఆయా గ్రామాల ప్రజలు పంట చేలకు, అటవీ ప్రాంతాలకు వెళ్లకుండా 144 సెక్షన్ విధించారు. దాడి చేసిన చోటుకే పులి మళ్లీ వచ్చే అవకాశం ఉందని, అటువైపు ఎవ్వరూ వెళ్లొద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.జిల్లాలోని అటవీ ప్రాంత గ్రామాల్లో సంచరిస్తున్న పులులు ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నాయి. నిత్యం ఎక్కడో చోట పశువుల మందలపై పంజా విసురుతూ దడ పుట్టిస్తున్నాయి. నాలుగేళ్ల క్రితం దహెగాం మండలం దిగడ గ్రామానికి చెందిన విగ్నేశ్‌ను, పెంచికల్‌పేట్ మండలం కొండపల్లి గ్రామానికి చెందిన పసుల నిర్మలను, గతేడాది వాంకిడి మండ లం ఖానాపూర్‌కు చెందిన రైతు సిడాం భీము ను పొట్టనబెట్టుకోగా, ఆ ఘటనలు మరవకముందే శు క్రవారం ఓ పులి మరో మహిళను బలి తీసుకున్నది.

పత్తి ఏరుతుండగా దాడి..

కాగజ్‌నగర్ మండలం గన్నారం గ్రామానికి చెందిన మోర్లె లక్ష్మి (22) .. శు క్రవారం మరో 20 మంది కూలీలతో కలిసి సమీపంలోని చేనులో పత్తి ఏరేందుకు వెళ్లింది. ఉదయం 8.30 గంటల ప్రాంతంలో అందరూ పనిలో నిమగ్నం కాగా.. పెద్ద పులి ఒక్కసారిగా మోర్లె లక్ష్మిపై దాడి చేసింది. కూలీలు కేకలు వేయడంతో అది అక్కడి నుంచి వెళ్లిపోయింది. లక్ష్మిని వెంటనే పట్టణంలోని ప్రైవేట్ దవాఖానకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

ఇప్పటి వరకు నలుగురు

జిల్లాలో పులుల దాడుల్లో ఇప్పటి వరకు నలుగురు మృతి చెందారు. 2020 నవంబర్ 11న దహెగాం మండలం దిగడ గ్రామానికి చెందిన విగ్నేష్ చేపల వేటకు వెళ్లగా, పులి దాడి చేయడంతో మృతి చెందాడు. 2020 నవంబర్ 29న పెంచికల్‌పేట్ మండలం కొండపల్లి గ్రామానికి చెందిన పసుల నిర్మల (15) పత్తి ఏరుతుండగా, పెద్ద పులి దాడిచేసి చంపేసింది. అలాగే 2023 నవంబర్ 16న వాంకిడి మండలం ఖానాపూర్‌కు చెందిన రైతు సిడాం భీము తన చేనులో పత్తి ఏరుతుండగా పులి పంజా విసరడంతో మృత్యువాత పడ్డాడు. తాజాగా.. శుక్రవారం గన్నారంలో పత్తి ఏరుతున్న మహిళపై పులి దాడి చేసి చంపడం స్థానికంగా కలకలం రేపుతున్నది. కాగా, ఉమ్మడి జిల్లాలో పులుల దాడుల దడపుట్టిస్తున్నాయి. ఈ ఏడాది దాదాపు 40 వరకు పశువులపై దాడులు చేశాయి. ఎప్పుడు ఏ వైపు నుంచి వచ్చి దాడులు చేస్తాయోనని ప్రజలు వణికిపోతున్నారు.

### తిరుమలలో రాజకీయ ప్రసంగాలపై నిషేధం

తిరుమల : తిరుమల పవిత్రతను, ఆధ్యాత్మిక ప్రశాంత వాతావరణాన్ని కాపాడేం దుకు తిరుమలలో రాజకీయ, ద్వేషపూరిత ప్రసంగాలను నిషేధించాలని టీటీడీ నిర్ణయించింది. నిత్యం గోవింద నామాలతో మారుమోగే పవిత్రమైన తిరుమల దివ్య క్షేత్రంలో, గత కొంతకాలంగా శ్రీవారి దర్శనార్థం తిరుమలకు విచ్చేసిన రాజకీయ నాయకులలో కొంతమంది, దర్శనానంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ రాజకీయ ప్రసంగాలు, విమర్శలు చేయడం పరిపాటిగా మారింది. దీంతో తిరుమలలో ఆధ్యాత్మిక వాతావరణానికి ఆటంకం కలుగుతోం ది. ఈ నేపథ్యంలో రాజకీయ ప్రసంగాలను నిషేధించాలని టీటీడీ బోర్డు ఇటీవల తీర్మానించింది. తిరుమలకు విచ్చేసి రాజకీయ విమర్శలు చేసే వ్యక్తులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని తిరుమలలో ఆధ్యాత్మిక వాతావరణం దెబ్బతీసే ప్రసంగాలకు దూరంగా ఉండి టీటీడీకి సహకరించాలని విజ్ఞప్తి చేయడమైనది. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని తెలియజేయడమైనది.

## కాజీపేట వ్యాగన్ ఫ్యాక్టరీ ఏర్పాటులో కాంగ్రెస్ పాత్ర శూన్యం



వరంగల్: విభజన చట్టం హామీల అమలులో బీజేపీ ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ (దాస్యం వినయ్ భాస్కర్) అన్నారు. కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ బదులు కేంద్రం వ్యాగన్ ప్యాక్‌కి అనుమతి ఉంది. వ్యాగన్ ఫ్యాక్టరీ తమవల్లే వచ్చిందని కాంగ్రెస్ నేతలు ప్రగల్భాలు పలుకుతున్నారు. కోచ్ ఫ్యాక్టరీ కోసం ఆ పార్టీ ఏనాడూ డిమాండ్ చేయాలి. వ్యాగన్ ఫ్యాక్టరీ ఏర్పాటులో హస్తం పార్టీ పాత్ర శూన్యమని చెప్పారు. వరంగల్ ఖాజీపేటలో బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. 'విభజన చట్టంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు కేంద్రం పలు హామీలు ఇచ్చింది. కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీకి కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ, ములుగులో గిరిజన యూనివర్సిటీకి హామీలు ఇచ్చింది. అయితే వాటి అమలులో బీజేపీ సర్కార్ పూర్తిగా విఫలమైంది. కోచ్ ఫ్యాక్టరీకి బదులు వ్యాగన్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తోంది. కోచ్ ఫ్యాక్టరీ అవసరం లేదు పార్లమెంటులోనే కేంద్రం. మహారాష్ట్రలో ఎన్నికలు ఉండటంతో లాతూరుకు కోచ్ ఫ్యాక్టరీని ఇచ్చారు.దగ్గరలో ఉన్న విజయవాడ, గుంటూరుకు రైల్వే డివిజన్ ??ఇచ్చారు. కాజీపేటను రైల్వే డివిజన్ ??చేయాలని అడిగితే మాత్రం పట్టించుకోవడం లేదు. ఈ జంక్షన్ పరిధిలో రైల్వేకు అత్యధిక ఆదాయం వస్తోంది. ఇందిరాగాంధీ హయాంలోనే కాజీపేట రైల్వే డివిజన్ ??అంగీకరించారు. ఇక్కడ వ్యాగన్ ఫ్యాక్టరీకి కేసీఆర్ 160 ఎకరాలు కేటాయించారు. కాజేపేటలో కోచ్ నిర్మాణం కోసం పోరాటం కొనసాగుతుంది. విభజన చట్టంలోనే కేసీఆర్ కోచ్ ఫ్యాక్టరీ హామీ పెట్టారు. కాగా, వ్యాగన్ ఫ్యాక్టరీ తమ వల్లే వచ్చిందని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. అయితే కోచ్ ఫ్యాక్టరీ కోసం ఆ పార్టీ ఏనాడూ చేయలేదు. వ్యాగన్ ఫ్యాక్టరీ ఏర్పాటులో కాంగ్రెస్ పాత్ర ఏమీ లేదు.ఈ బోడగుట్టలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలి. దీనికి రూ.10 కోట్ల ఖర్చులో రాష్ట్రం నుంచి రూ.5 కోట్లు ఇవ్వాలని గత ప్రభుత్వం ప్రకటించింది. కాజీపేటలో రూ.50 కోట్లతో రైల్వే ఓబర్ బ్రిడ్జి నిర్మాణం ప్రారంభించాం. ఈ ప్రాంతం అభివృద్ధికి భారీగా నిధులు ఖర్చు చేశాం. స్థానికులకు 60 శాతం ఉద్యోగాల కోసం పోరాడుతాం. చిరు వ్యాపారులకు రైల్వే స్థలంలో స్టాల్స్ నిర్మించాలి. దత్తాత్రేయ కేంద్రమంత్రిగా ఉ న్నప్పుడు ఇచ్చిన హామీ నెరవేర్చలేదు. బీజేపీవన్నీ హామీలు తప్ప ఆచరణ శూన్యం.

## ఢిల్లీలో కొనసాగుతున్న వాయు కాలుష్యం.. పడిపోయిన ఉష్ణోగ్రతలు

న్యూఢిల్లీ, దేశ రాజధాని ఢిల్లీ (ఢిల్లీ)లో వాయు కాలుష్యం (వాయు కాలుష్యం) కొనసాగుతోంది. దీనికి తోడు స్థాయిలు కూడా పడిపోయాయి. దీంతో చలి తీవ్రతకు ఢిల్లీ వాసులు గజగజ వణికిపోతున్నారు. వరుసగా మూడోరోజు ఢిల్లీలో అత్యల్ప కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇవాళ 9.8 డిగ్రీ సెల్సియస్‌తో ఈ సీజన్‌లో రెండో అత్యల్ప కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.ఇక ఢిల్లీలో గాలినాణ్యత చాలా పేలవమైన కేటగిరీలో నమోదైంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్) ప్రకారం.. శనివారం ఉదయం 7 గంటల ప్రాంతంలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (వాయు నాణ్యత సూచిక) 349గా నమోదైంది.



## లగచర్లలో పారిశ్రామిక పార్కు భూసేకరణకు నోటిఫికేషన్..




హైదరాబాద్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్క్ కోసం భూసేకరణకు కొత్త నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇండస్ట్రియల్ పార్క్‌ను వికారాబాద్ జిల్లా దుద్యాల మండలంలో ఏర్పాటు చేయనున్నారు.దీనికి సంబంధించి మండలంలోని లగచర్లలో 110.32 ఎకరాలు, పోలేపల్లిలో 71.39 ఎకరాల భూసేకరణకు ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేశారు. లాగాచర్ల, హకీంపేట్, పోలేపల్లి గ్రామాలలో మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు భూసేకరణ అధికారిగా తాండూర్ సబ్ కలెక్టర్ ఉమాశంకర్ నియమించింది. ఇటీవల రైతులు, స్థానికుల ఆందోళనల నేపథ్యంలో గతంలో ఇక్కడి ఫార్మా గ్రామాల కోసం ఇచ్చిన భూసేకరణ నోటిఫికేషన్‌ను వెనక్కి తీసుకున్న విషయం తెలిసిందే. ఫార్మా కంపెనీల ఏర్పాటుతో పచ్చని పల్లెలు కాలుష్యంగా మారతాయని లగచర్ల ప్రజలు భూసేకరణను అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో లగచర్ల, పోలేపల్లిలో కాలుష్య రహిత సంస్థలు నెలకొల్పితే స్వచ్ఛందంగా భూములు ఇస్తామని స్థానిక ప్రజలు అభిప్రాయాలు వ్యక్తం చేశారు.దీంతో ప్రభుత్వం పారిశ్రామిక కారిడార్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు దుద్యాల మండలంలోని లగచర్లలో, పోలేపల్లిలో మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు భూ సేకరణకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఇదిలా ఉండగా కొత్తగా ఏర్పాటు చేసే పారిశ్రామిక కారిడార్ లో భాగంగా టెక్స్ టైల్ కంపెనీలకు ప్రాధాన్యత ఇవ్వను న్నట్లు తెలుస్తోంది. టెక్స్టైల్ కంపెనీ ఏర్పాటు చేసినా.. ఇక్కడ పొల్యూషన్ ఉ ండదని ప్రభుత్వం భావించింది. అంతేకాకుండా స్థానిక యువతకు పెద్దఎత్తున ఉద్యోగాలు వస్తాయన్న ఆలోచనతోనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

## సంపాదకీయం

ఆదివారం 01-12-2024

# లోకుల కన్నా కాకులే నయం!

“ఏ కులమని వివరమడిగితే ఏమని చెప్పుదు లోకులకు పలు కాకులకు” అని ఓ మహానుభావుడు ఏదో అన్నాడుగానీ, కాకులకు ఉన్న మంచితనం మనకు ఎక్కడ ‘ఏడ్చింది’? తద్దినాలు పెట్టే వేళల్లో పితృదేవతలను కాకుల రూపంలో చూసుకుని…“ఏ కులమని వివరమడిగితే ఏమని చెప్పుదు లోకులకు పలు కాకులకు” అని ఓ మహానుభావుడు ఏదో అన్నాడుగానీ, కాకులకు ఉన్న మంచితనం మనకు ఎక్కడ ‘ఏడ్చింది’? తద్దినాలు పెట్టే వేళల్లో పితృదేవతలను కాకుల రూపంలో చూసుకుని అవి గారెలను ముడితే మురిసిపోవడం తప్ప మనకు కాకి లక్షణాలు ఏమున్నాయి! కాకికి ఆహారం దొరికితే కావు కావు అంటూ ఇతర కాకుల్ని పిలుస్తుంది. మనకు ఆ బుద్ధి ఏదీ? పరుల నోటి దగ్గరున్న అన్నాన్నీ లాక్కోవడమేగా మనిషి చేస్తున్న పని! మానవత్వం అని గొప్పగా మాటల్లో చెప్పుకొంటాంగానీ, అది మన చేతల్లో లేదాయే! కాకినయినా కాకపోతిని అనుకుంటున్నవాళ్లు ఎక్కడో తళుక్కుమంటున్నారుగానీ, ఎక్కువ మంది లేరు. పైగా సమాజానికి సిగ్గుచేటయిన తత్వం ఎక్కడంటే అక్కడ తారసపడుతోంది. మానవత్వం నీరసపడిపోతోంది. ఇటీవల తెలంగాణ రాష్ట్రం కీసరలో రోడ్డు ప్రమాదంలో ఒకాయన కాళ్లు నుజ్జునుజ్జయ్యి ఆర్తనాదాలు చేస్తున్నా చూసిన వాళ్లు వీడియోలు, ఫొటోలు తీయడంలో మునిగిపోయారు. దొరకునా ఇటువంటివి అనుకుని ఇతరులకు షేర్ చేశారు. ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేయలేదు. ఇది వీడియోనో, మానవత్వం మీద దాడో ఆలోచించకపోయినా అర్థమవుతుంది. ఎవరో పుణ్యాత్ముడు 108కి ఫోన్ చేయడంతో వాళ్లు వచ్చి ఆసుపత్రికి తరలించేటప్పటికే బాధితుడి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ఏపీలోని విజయనగరంలో కళ్లముందు కన్నకొడుకు ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోతున్నా.. చుట్టూ మనుషులున్నా.. ఆ తల్లి రోదన విన్నా.. ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. అయినా వీడియోల హడావుడికి లోటు లేదు. 108 వాహనం వచ్చి బాధితుణ్ని ఆసుపత్రికి తీసుకెళ్లినా ప్రాణం మిగల్లేదు. గర్భశోకమే మిగిలింది.కళ్ల ముందు హత్యలు జరుగుతున్నా వీడియోలు తీసుకోవడానికి చేతులొస్తున్నాయి తప్ప, బాధితులను కాపాడటానికి కాళ్లు కదలడం లేదు. మనం చదువుకున్నదేంటి? మనుషులం కాదా ఏంటి? అన్న ధ్యాస కనపడటం లేదు. మనందరం చదువుకున్న భాగవతం ఏం చెబుతోంది.. మన బాగోతం ఎలా ఉంది? “లావొక్కింతయు లేదు… ప్రాణముల్ ఠావుల్ తప్పెను.. మూర్ఛ వచ్చె” అంటూ గజేంద్రుడు లబోదిబోమంటూ ఉంటే ఎలా విన్నాడో, ఎలా కన్నాడో తెలియదుగానీ, విష్ణుమూర్తి తన భార్య లక్ష్మీదేవికి కూడా చెప్పకుండా హుటాహుటిన వచ్చి రక్షించాడంటారు. మనం నేర్చుకున్నదేమిటి? దేవుడే చేయాలా? మనిషి చేయకూడదా? ఒక్కోసారి ఆత్మహత్యా సదృశమైన ధోరణులూ కనిపిస్తున్నాయి. ఒక పక్కన జలపాతంలోకి జారిపడే ప్రమాదం పొంచి ఉన్నా.. ఎక్కిన కొండమీది నుంచి కింద పడే ముప్పు ముందున్నా.. సెల్ఫీ తీసుకోవడం పిచ్చిగా మారిపోయింది. ప్రాణాలకు తెగించి అయినా సెల్ఫీ తీసుకోవడమే ‘సెల్ఫీ’ష్‌నెస్ అయిపోయింది. మచ్చుకు చెబుతున్నవి కొన్నే అయినా, ఉన్నవి అసంఖ్యాకమే. మానవత్వం, మానవత్వం అంటూ చెప్పుకొంటాంగానీ కనీసం మనకు పశుత్వం అయినా ఉందా అన్నది వినిపిస్తున్న కుంభకోణాల్లోని మిలియన్ డాలర్లంత ప్రశ్న. ఈ మధ్య పార్వతీపురం జిల్లా మన్యంలో ఏనుగుల గుంపు ఓ కాలువను దాటుతోంది. మిగతా అన్నీ కాలువ దాటగలిగినా ఒక్క ఏనుగు మాత్రం దాటలేక ఇబ్బంది పడుతోంది. అది గమనించిన రెండు ఏనుగులు వెనక్కి వచ్చి తొండంతో సాయం అందించి దాన్ని కాలువ గట్టెక్కించాయి. సమస్య నుంచి బయటపడేశాయి. ఇది కథ కాదు, కళ్ల ముందు జరిగిందే. ఏనుగులకు సెల్‌ఫోన్లు లేకపోవడం మంచిదైంది. లేకపోతే అవీ సాయం మానేసి, కాలువలోని ఏనుగు అవస్థల్ని వీడియో తీసుకునేవేమో! అందువల్ల పశుపతీ! మమ్మల్ని ఆ గజాల బాటలో నడిపించు అని దేవుణ్ని ప్రార్థించక తప్పదు. ఎవరికి వారు మనిషిని అని రుజువుపరచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మన వైపు మనం వేలెత్తి చూపుకోవాలి. అంతే. ఈ మధ్య ఓ పెద్దమనిషి మాట షికారు చేస్తోంది. ‘‘మీ కళ్ల ముందు హత్యలు, అత్యాచారాలు, అఘాయిత్యాలు జరుగుతూ ఉంటే చూస్తూ నిలబడి ఉండకండయ్యా! కూర్చోండి. మీరు నిలబడి ఉంటే వెనక వాళ్లకు ఎలా కనబడుతుంది? వాళ్లు వీడియోలు ఎలా తీసుకోగలరు?’’ అని ప్రశ్నించి హితవు చెప్పారు. బిత్తరపోవాల్సిన అవసరం లేదు! దుర్యోధన, దుశ్శాసన దుర్వినీత కార్యక్రమాల్ని నిండు సభలో కళ్లప్పగించి చూసిన వాళ్లు ఉన్నారు. ఎటొచ్చీ వీడియోలు తీయడానికి అప్పటి వాళ్ల చేతుల్లో సెల్‌ఫోన్లు లేవు. ద్రౌపదీ వస్త్రాపహరణ ఘట్టంలోనూ శ్రీకృష్ణుడే వచ్చి కాపాడాడు. ఎప్పుడూ దేవుడే వచ్చి కాపాడాలా? మనం చేయగలిగింది చేయలేమా? సెల్ పట్టిన చేతులు ఆపదలో ఉన్నవాడికి సాయం చేయలేవా? పాపం అంటూ చేయి అందిస్తే పాపమా.. పుణ్యమా? పెరిగిన విజ్ఞానం మానవత్వం పెరగడానికీ ఉపయోగపడాలిగా!

# గండం గట్టెక్కించే నిధి…

ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థల్లో అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) చాలా ముఖ్యమైనది. అభివృద్ధి బ్యాంకుల మాదిరిగా ఐఎంఎఫ్ నిర్దిష్ట ప్రాజెక్టులకు రుణాలు ఇవ్వదు. ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న దేశాలు స్థిరత్వం సాధించడానికి ఊతమిస్తుంది. ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థల్లో అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) చాలా ముఖ్యమైనది. అభివృద్ధి బ్యాంకుల మాదిరిగా ఐఎంఎఫ్ నిర్దిష్ట ప్రాజెక్టులకు రుణాలు ఇవ్వదు. ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న దేశాలు స్థిరత్వం సాధించడానికి ఊతమిస్తుంది. ప్రపంచం 1929–30లో మహామాంద్యం గుప్పిట్లో విలవిల్లాడింది. భవిష్యత్తులో ఇటువంటి సమస్యలను పరస్పర ఆర్థిక సహకారంతో అధిగమించాలని దేశాలు సంకల్పించాయి. తద్వారా అంతర్జాతీయ ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడుకోవాలని తీర్మానించుకున్నాయి. ఆ సంకల్పమే 1944 జులైలో ఐఎంఎఫ్ స్థాపనకు దారితీసింది. ఈ సంస్థలో ఇప్పుడు 191దేశాలు సభ్యత్వం పొందాయి. విఖ్యాత ఆర్థికవేత్త జాన్ మేనార్డ్ కీన్స్, అమెరికన్ విధానకర్త హ్యారీ డెక్స్‌టర్ వైట్ భావనల నుంచి రూపుదిద్దుకున్న ఐఎంఎఫ్ ఇంతవరకు సభ్య దేశాలకు భారీ మొత్తంలో రుణాలిచ్చింది.

సంక్షోభ నివారణ

సరైన ఆర్థిక, ద్రవ్య విధానాలను చేపట్టకపోతే అప్పుల కొండ పెరిగిపోతుంది. విత్త సంబంధ లోటు, వాణిజ్యలోటు ఏర్పడతాయి. దేశ కరెన్సీ విలువను బాగా తక్కువగా నిర్ణయిస్తే దిగుమతుల బిల్లు పెరిగిపోతుంది. విదేశీ మారక ద్రవ్య నిల్వలు హరించుకుపోతాయి. దేశీయంగా ఉత్పత్తి అయిన వస్తువులు అంతర్జాతీయ మార్కెట్లో పోటీపడలేకపోతాయి. ఇది దేశార్థికాన్ని కుదేలు చేస్తుంది. రాజకీయ అస్థిరత, దుర్బల వ్యవస్థలు కూడా ఆర్థిక సంక్షోభానికి కారణాలవుతాయి. ఇలాంటి సంక్షోభ నివారణకూ సభ్య దేశాలకు ఐఎంఎఫ్ ముందస్తు రుణ సాయం చేస్తుంది. ఎప్పటికప్పుడు మారే సభ్య దేశాల ఆర్థిక అవసరాలకు తగినట్లు రుణాలిస్తుంది. ద్రవ్య విధాన పరంగా అంతర్జాతీయ సహకార సాధన ఐఎంఎఫ్ లక్ష్యాల్లో ఒకటి. వ్యాపారం–ఆర్థికాభివృద్ధికి ప్రోత్సాహం, ఆర్థిక ప్రగతిని దెబ్బతీసే విధానాలను నివారించడం కూడా సంస్థ లక్ష్యాలే. అంతర్జాతీయ మార్కెట్లో చమురు, ముడి ఖనిజాలు, వ్యవసాయ ఉత్పత్తులు తదితరాల ధరలు పెరిగిపోతే అల్పాదాయ దేశాలకు ఇబ్బందులు తప్పవు. సంపన్న దేశాలపైనా దుష్ప్రభావం పడుతుంది. అమెరికాలో 2008నాటి ఆర్థిక సంక్షోభం పేద, ధనిక అనే తేడా లేకుండా అన్ని దేశాలనూ దెబ్బతీసిన సంగతి తెలిసిందే. ఇలా విదేశీ కారణాలూ ఆర్థిక కడగండ్లను తెచ్చిపెడతాయి. అలాగే కొవిడ్ మహమ్మారి ప్రపంచంలో అన్ని దేశాలనూ ఆర్థిక, సామాజిక సుడిగుండంలోకి నెట్టింది. ఇలాంటి ఆర్థిక ఉపద్రవాలు విరుచుకుపడినప్పుడు ఐఎంఎఫ్ పేద దేశాలకు రుణమిచ్చి అవి తిరిగి కోలుకోవడానికి తోడ్పడుతుంది. ఆహారం, చమురు వంటి నిత్యావసరాల దిగుమతులకు చెల్లింపులు జరపడానికి, రుణ వాయిదాలూ వడ్డీ కిస్తీలు కట్టడానికి తగిన విదేశీ మారక ద్రవ్యం లేని ఏ దేశమైనా సంక్షోభంలో కూరుకుపోతుంది. గతంలో చంద్రశేఖర్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు భారత్‌కు ఇలాంటి పరిస్థితే తలెత్తింది. అప్పుడు మన బంగారం నిల్వలను బ్రిటన్‌లో తాకట్టుపెట్టి బయటపడాల్సి వచ్చింది. ఇలాంటి ఆర్థిక దుస్థితిని నివారించడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి ఐఎంఎఫ్ తన సభ్య దేశాల ఆర్థిక మంత్రులు, కేంద్ర బ్యాంకులు, ఆర్థిక పర్యవేక్షణ సంస్థలకు సమాచారమిస్తుంది. అవసరమైన సందర్భాల్లో శిక్షణ, సలహాలిస్తుంది. నేడు అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థకు సవాళ్లు పెరిగాయి. వాటిపై ఐఎంఎఫ్ నిఘాను ముమ్మరం చేస్తోంది. పభుత్వాలు తమ వ్యయాన్ని తగ్గించుకుని,




ఆదాయం ఎలా పెంచుకోవాలో, దానికి ఎలాంటి పన్ను, దిగుమతి విధానాలను అనుసరించాలో ఐఎంఎఫ్ సిఫార్సు చేస్తుంది. స్వదేశీ, విదేశీ రుణభారాలను తగ్గించుకోవడానికీ, సామాజిక భద్రతా విధానాలను అనుసరించడానికీ, ఆర్థిక దుస్థితి నుంచి గట్టెక్కించే బడ్జెట్ రూపకల్పనకూ సలహాలు ఇస్తుంది. ఆదాయాన్ని పెంచుకుని, అత్యవసర ప్రజా సర్వీసులను నిర్వహించడమెలా అనే అంశంపై లైబీరియా దేశం ఐఎంఎఫ్ మార్గదర్శకత్వం తీసుకుంది. 2014లో ఎబోలా వ్యాధి విరుచుకుపడి లైబీరియా ఆర్థికంగా దెబ్బతిన్నప్పుడు ఐఎంఎఫ్ సాయం ఎంతో అక్కరకొచ్చింది. 1980 దశకంలో ఆఫ్రికాతోపాటు ఇతర ఖండాల్లోనూ పేద దేశాలు వాణిజ్య లోటు వంటి తీవ్ర ఆర్థిక సమస్యలను ఎదుర్కొన్నాయి. వాటికి ఐఎంఎఫ్ స్వల్ప వడ్డీకి రుణాలిచ్చి గండం గట్టెక్కడానికి తోడ్పడింది. ఈ ఏడాది జూన్‌లో శ్రీలంకకు 33.6 కోట్ల డాలర్ల నిధులిచ్చిన ఐఎంఎఫ్ తరవాత మరో 33.6 కోట్ల డాలర్లను మంజూరు చేసింది.

పేద దేశాలకు సూచనలు

ప్రపంచ ద్రవ్యోల్బణ రేటు 2023లో 6.8శాతం. 2025లో అది 4.5 శాతానికి దిగివస్తుందని ఐఎంఎఫ్ అంచనా. ప్రపంచ ఆర్థికాభివృద్ధి రేటు యథాతథంగా 3.2శాతంగానే కొనసాగుతుందని ఆ సంస్థ భావిస్తోంది. 2025లో భారత్ వృద్ధిరేటు మాత్రం 6.5శాతంగా ఉంటుందని లెక్కగట్టింది. నేడు ప్రపంచీకరణకు, స్వేచ్ఛా వాణిజ్యానికి ప్రతికూల పవనాలు వీస్తున్నాయి. 2019తో పోలిస్తే 2023లో వాణిజ్యానికి ప్రతిబంధకాలు మూడు రెట్లు పెరిగాయి. 20 ఏళ్లలో ఎన్నడూ ఎరుగని స్థాయిలో 2022లో ధరల పెరుగుదలను చూశాం. ఈ ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడానికి ఐఎంఎఫ్ సలహా సంప్రదింపులు అక్కరకొస్తున్నాయి. వాతావరణ మార్పులను అధిగమించడానికి పెట్టుబడుల సేకరణలో పేద దేశాలకు ఆ సంస్థ సూచనలిస్తోంది. ఈ కృషిలో స్థానిక ప్రైవేటు రంగాన్నీ భాగస్వామిని చేయాలని ప్రయత్నిస్తోంది.

విమర్శలు సైతం…

రెండో ప్రపంచ యుద్ధం తరవాత సంపన్న దేశాలు ఏర్పాటు చేసిన ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు అగ్ర రాజ్యాల అజెండాలనే అమలు చేస్తున్నాయని కొందరు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తద్వారా ప్రపంచ ఆర్థిక విధానాలపై సంపన్న దేశాలు తిరుగులేని ఆధిపత్యం చలాయించేలా అవి తోడ్పడుతున్నాయని విశ్లేషిస్తున్నారు. దాంతో వర్ధమాన దేశాల ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మెజారిటీ దేశాల అవసరాలను ప్రతిబింబించేలా అంతర్జాతీయ సంస్థలను పూర్తిగా ప్రక్షాళించాలని, లేదంటే రద్దు చేయాలనే డిమాండ్లు వస్తున్నాయి. మరీ ముఖ్యంగా వాతావరణ మార్పులతో విలవిల్లాడుతున్న దేశాలను ఐఎంఎఫ్ వంటివి రుణ ఊబిలోకి నెడుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

# దక్షిణ కొరియాలో భీకర హిమపాతం

సియోల్,దక్షిణ కొరియా రాజధాని సియోల్ నగరంలో.. వరుసగా రెండో రోజు తీవ్ర స్థాయి హిమపాతం కురిసింది. దీంతో ఆ నగరం అంతా మంచు దుప్పటి పరిచినట్లు అయ్యింది. డజన్ల సంఖ్యలో విమానాలను రద్దు చేశారు. బోట్లు కూడా రద్దు అయ్యాయి. చలి తీవ్రత తట్టుకోలేక కనీసం అయిదు మంది మృతిచెంది ఉంటారని భావిస్తున్నారు. గడిచిన శతాబ్ద కాలంలో ఇంత భారీ స్థాయిలో హిమపాతం కురవడం ఇది మూడోసారి. రికార్డుల ప్రకారం 1907 నుంచి ఇప్పటి వరకు మూడుసార్లు మాత్రమే సియోల్‌లో ఈ స్థాయిలో మంచు కురిసింది. నగరంలోని అనేక ప్రాంతాల్లో సుమారు 40 సెంటీమీటర్ల మేర మంచు పేరుకుపోయింది. దీంతో దాదాపు 140 విమానాలను రద్దు చేశారు. గ్యాంగ్వాన్ ప్రావిన్సులోని వోంజు నగరంలో సుమారు 53 వాహనాలు ఒకదాన్ని ఒకటి ఢీకొన్నాయి. ఆ ఘటనలో 11 మంది గాయపడ్డారు. సియోల్‌లోని ప్రధాన విమానాశ్రయం ఇంచియాన్‌లో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విమానాలు దాదాపు రెండు గంటల పాటు ఆలస్యంగా నడిచాయి. గియాంగి ప్రావిన్సులో ఉన్న వందలాది స్కూళ్లను మూసివేశారు. పొరుగుదేశమైన ఉత్తర కొరియాలో కూడా తీవ్ర స్థాయిలో మంచు కురిసింది. సుమారు 10 సెంటీమీటర్ల మేర మంచు పేరుకుపోయింది.

# యూపీఎస్సీ మెయిన్స్ ఫలితాలు విడుదల

న్యూఢిల్లీ,యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ యూపీఎస్సీ ఈఎస్ఈ మెయిన్స్ 2024 రాసిన అబ్యర్థుల మార్కులను గురువారం విడుదల చేసింది. యూపీఎస్సీ ఇంజనీరింగ్ సర్వీసెస్ (మెయిన్) ఎగ్జామినేషన్, 2024కు హాజరైన అభ్యర్థులు యూపీఎస్సీ అధికారిక వెబ్సైట్ ద్వారా తమ మార్కులను చెక్ చేసుకోవచ్చు. యూపీఎస్సీ ఈఎస్ఈ మెయిన్స్ ఫలితాలు 2024 నవంబర్ 23న విడుదలయ్యాయి. మొత్తం 206 మంది అభ్యర్థుల నియామకానికి సిఫార్సు చేయగా, వారిలో 92 సివిల్ ఇంజనీరింగ్, 18 మెకానికల్ ఇంజనీరింగ్, 26 ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, 70 మంది ఇ అండ్ టి ఇంజనీరింగ్ అభ్యర్థులు ఉన్నారు. ఎంపికైన వారిలో జనరల్ కేటగిరీలో అత్యధికంగా 71 మంది, ఓబీసీల్లో 59 మంది, ఎస్సీల్లో 34 మంది, ఈడబ్ల్యూఎస్ లో 22 మంది, ఎస్టీల్లో 20 మంది ఉన్నారు. కాగా యూపీఎస్సీ ఈఎస్ఈ 2024 మెయిన్ లో ఉత్తీర్ణత సాధించిన వారిలో రోహిత్ ధోంఢ్గే మొదటి స్థానంలో నిలవగా, హర్షిత్ పాండే, లక్ష్మీకాంత్ వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. యూపీఎస్సీ ఇంజినీరింగ్ సర్వీసెస్ పరీక్ష జూన్ 2024లో జరిగింది, ఇంటర్వ్యూ లేదా పర్సనాలిటీ టెస్ట్ అక్టోబర్ 7, 8, 9, 10, 14, 15, 16, 17, 18, 21, 22, 23, 24, 25, నవంబర్ 4, 5, 6 తేదీల్లో జరిగింది. ఉదయం 9 గంటల నుంచి మొదటి షిఫ్ట్, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రెండో షిఫ్టు చొప్పున రెండు షిఫ్టుల్లో ఇంటర్వ్యూ నిర్వహించారు. ఈ రిక్రూట్ మెంట్ డ్రైవ్ ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న సంస్థలో 251 ఖాళీలను భర్తీ చేయనుంది.

# ప్లాన్ బీ అమలు…

ముంబై,మహారాష్ట్ర తదుపరి ముఖ్యమంత్రి ఎవరన్నది ఇంకా తేలలేదు. ఈ అంశంపై తీవ్రంగా చర్చ నడుస్తోంది. గత శాసనసభ గడువు మంగళవారంతో ముగిసినప్పటికీ కొత్త ప్రభుత్వ ఏర్పాటుపై మహారాష్ట్రలో ఇంకా స్పష్టత రాలేదు. ముఖ్యమంత్రిగా ఎవరు బాధ్యతలు చేపట్టాలన్నదానిపై సందిగ్ధత కొనసాగుతోంది. ఓవైపు బీజేపీ అత్యధిక సీట్లు గెలుచుకున్న నేపథ్యంలో తమ నాయకుడు దేవేంద్ర ఫడ్నవీస్‌కు ముఖ్యమంత్రి పదవిని అప్పగించాలని ఆ పార్టీ నేతలు కోరుతున్నారు. మరోవైపు.. షిండే నాయకత్వంలోనే ఈ ఎన్నికల్లో తమ కూటమి గెలుపొందినందున ఏక్‌నాథ్ షిండేనే ముఖ్యమంత్రిగా కొనసాగించాలని శివసేన కార్యకర్తలు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ఆసక్తికర విషయం ఒకటి ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. సీఎం పదవి దక్కని పక్షంలో షిండే వర్గం ప్లాన్‌–బీని సిద్ధం చేసుకున్నట్లు తెలిసింది. ఏక్‌నాథ్ షిండేని ముఖ్యమంత్రిని చేయకపోతే.. హోంశాఖ ఇవ్వాల్సిందిగా డిమాండ్ చేసినట్లు సమాచారం. మంగళవారం అర్ధరాత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో షిండే వర్గం నేతలు జరిపిన సమావేశంలో ఈ డిమాండ్‌ను ప్రస్తావించినట్లు తెలిసింది. ఈ మేరకు సంబంధిత వర్గాలను ఊటంకిస్తూ జాతీయ మీడియాలో వరుస కథనాలు వస్తున్నాయి. దీంతోపాటు మరికొన్ని వార్తలు కూడా ప్రచారంలో ఉన్నాయి. రెండు రోజుల క్రితం దేవేంద్ర ఫడ్నవీస్‌కు జాతీయ స్థాయిలో కీలక పదవి వస్తుందని ప్రచారం జరిగింది. తాజాగా మరో అప్‌డేట్ బయటకు వచ్చింది. ఫడ్నవీస్‌ను ముఖ్యమంత్రిని చేసి ఏక్‌నాథ్ షిండేను కేంద్రమంత్రిగా, ఆయన కుమారుడు శ్రీకాంత్ షిండేను మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా చేస్తారని ప్రచారం జరుగుతున్నది. మరొక ఉప ముఖ్యమంత్రిగా అజిత్ పవార్‌ను ప్రతిపాదించినట్లు సమాచారం. ఈ ఫార్ములా ద్వారా మూడు పార్టీలనూ ఆకర్షించేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నదని అంటున్నారు. ఇది షిండే గౌరవాన్ని తక్కువ చేయదని, ఈ విషయం తేలికగా పరిష్కారమవుతుందని బీజేపీ భావిస్తున్నది. అయితే షిండే ముఖ్యమంత్రి కావాలని శివసేన నేతలు గట్టిగా ఒత్తిడి తెస్తున్నారని కూడా చెబుతున్నారు.

# ఈ దేశాలకు ఒకే కరెన్సీ అవసరం!



సెంట్రల్ డెస్క్:ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మార్పులు చోటుచేసుకుంటున్న ప్రస్తుత పరిస్థితుల్లో, బహుళ ధ్రువ ఆర్థిక వ్యవస్థను సాధించాలనే ఆకాంక్షతో బ్రిక్స్ దేశాలు ఒకే కరెన్సీ ఏర్పాటుపై ఆసక్తిని వ్యక్తం చేస్తున్నాయి. ఒకే కరెన్సీ వలన ఈ దేశాల మధ్య వాణిజ్యాన్ని సులభతరం చేయడం, అమెరికా డాలర్‌పై ఆధారాన్ని తగ్గించడం, ఈ అభివృద్ధి చెందుతున్న మార్కెట్ల ఆర్థిక ప్రభావాన్ని ప్రపంచ స్థాయిలో పెంచడం సాధ్యమవుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే, భారతదేశం దృష్టిలో ఈ ప్రతిపాదన ఆచరణ సాధ్యమా? దీని ప్రయోజనాలు భారత ప్రయోజనాలకు అనుకూలమా? అనే అంశాలను సవివరంగా విశ్లేషించాల్సి ఉంది. భారతదేశం 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారడానికి ప్రయత్నిస్తున్న ఈ సమయంలో, సాంకేతిక విప్లవాలు, వాణిజ్య మార్పులు, భౌగోళిక ఉద్రిక్తతలు భారత ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయి. ఈ పరిస్థితుల్లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్రవ్య పరపతి విధానాల ద్వారా ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడం, ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడడం, వృద్ధిని ప్రోత్సహించడం వంటి ముఖ్యమైన బాధ్యతలను నిర్వహిస్తోంది. దీనికి తోడు, భారత వ్యూహాత్మక లక్ష్యాలు.. వాణిజ్య పోటీతత్వాన్ని పెంచడం, విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కీలకమైన పాత్రను పొందడం ప్రధానమైనవి.

బ్రిక్స్ దేశాల ఒకే కరెన్సీ వలన..

బ్రిక్స్ దేశాలు ఒకే కరెన్సీ వినియోగించుట వలన భారతదేశానికి ప్రధానంగా మూడు ప్రయోజనాలు ఉంటాయి. మొదటగా, ఇది విదేశీ వాణిజ్యాన్ని సులభతరం చేస్తుంది. చిన్న మధ్యతరహా సంస్థలకు కరెన్సీ మార్పిడి రేటు అనే పెద్ద సమస్య అస్థిరతను తొలగించడం ద్వారా ఈ దేశాల మధ్య వాణిజ్య వ్యయాలు తగ్గవచ్చు. తద్వారా, చిన్న, మధ్య తరగతి వ్యాపారాలు కొత్త మార్కెట్లు కనుగొని తమ వ్యాపారాన్ని విస్తరించుకోవచ్చు. రెండవది, డాలర్‌పై ఆధారాన్ని తగ్గించడం. బ్రిక్స్ ఒకే కరెన్సీ ద్వారా, డాలర్ వినియోగాన్ని తగ్గించి, భారతదేశ విదేశీ మారక నిల్వలను మరింత సమర్థవంతంగా ఉపయోగించుకోవచ్చు. మూడవది, ఇది భారతదేశానికి బ్రిక్స్ దేశాల్లో ప్రధానమైన పాత్రను కల్పిస్తుంది. ఈ పరిణామం ఆర్థిక సమన్వయానికి బలమైన మద్దతు ఇస్తుంది. ఈ ప్రయోజనాలతో పాటు, బ్రిక్స్ ఒకే కరెన్సీ భారతదేశానికి కొన్ని ప్రధాన సవాళ్లను కూడా తెస్తుంది. భారతదేశం ద్రవ్య విధానాన్ని ప్రత్యేక ఆర్థిక అవసరాలకు సరిపోయే విధంగా రూపొందిస్తుంది. బ్రిక్స్ ఒకే కరెన్సీ స్వీకరించడం వల్ల భారతదేశం ఆ విధానాన్ని మార్చుకోవలసి రావడం వల్ల, ద్రవ్యోల్బణ నియంత్రణ ఆర్థిక లక్ష్యాల సాధనలో సమస్యలు తలెత్తవచ్చు. భారతదేశ ఆర్థిక వైవిధ్యం బ్రిక్స్ దేశాల మధ్య ఉన్న అసమానతలకు కారణం కావచ్చు. ఉదాహరణకు, చైనా ఆర్థిక పరిమాణం భారతదేశానికి అయిదు రెట్లు ఎక్కువ. ఈ విభేదాలు బ్రిక్స్ ఒకే కరెన్సీ స్థిరత్వానికి ప్రమాదాన్ని కలిగించవచ్చు. యూరోజోన్ సంక్షోభం పాఠాలు బ్రిక్స్ ఒకే కరెన్సీ విషయంలో అప్రమత్తత అవసరమని సూచిస్తాయి. అంతేకాక, చైనాతో సరిహద్దు వివాదాలు రష్యాపై ఉన్న అంతర్జాతీయ ఆంక్షలు బ్రిక్స్ ఒకే కరెన్సీ స్థిరత్వానికి ముప్పుగా మారవచ్చు.

డాలర్‌పై ఆధారాన్ని తగ్గించేందుకు..

ఆర్థిక నిపుణులు బ్రిక్స్ ఒకే కరెన్సీ ప్రయోజనాలను గుర్తించినప్పటికీ, దాని ప్రమాదాలను కూడా హెచ్చరించారు. డా. రఘురామ్ రాజన్, ఆర్‌బీఐ మాజీ గవర్నర్, ఒకే కరెన్సీ వలన ద్రవ్య విధాన స్వాయత్తం కోల్పోవడంతో దేశ ఆర్థిక వ్యవస్థ ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంద ని అన్నారు. అలాగే, అరవింద్ సుబ్రమణియన్ వంటి ఆర్థిక నిపుణులు సరైన ఆర్థిక సమన్వ యం లేకపోతే, సమస్యలు మరింత తీవ్రమవుతాయని అభిప్రాయపడ్డారు. భారతదేశం బ్రిక్స్ ఒకే కరెన్సీని స్వీకరించకుండానే, ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించడం ఉత్తమం. భారతదేశం ఇప్పటికే %×చీ=% ట్రేడ్ ఫ్రేమ్‌వర్క్ ద్వారా స్థానిక మారకాలను ప్రోత్సహిస్తోంది. దీనిని బ్రిక్స్ దేశాలకు విస్తరించడం ద్వారా డాలర్‌పై ఆధారాన్ని తగ్గించవచ్చు. న్యూ డవలప్‌మెంట్ బ్యాంక్ వంటి ప్రాంతీయ ఆర్థిక సంస్థలను బలపరచడం, యూపీఐ వంటి చెల్లింపు వ్యవస్థలను బ్రిక్స్ దేశాల్లో అనుసంధానించడం వంటివి వాణిజ్య వృద్ధికి సహాయపడతాయి. భారతదేశం తన వ్యూహాలను భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా రూపొందించుకోవాలి. బ్రిక్స్ ఒకే కరె న్సీ వలన వాణిజ్య వృద్ధి, ఆర్థిక సమన్వయం సాధ్యమవుతుందని నిపుణులు అంటున్నప్పటికీ, దాని ప్రతికూల ప్రభావాలను భారతదేశం తప్పక గమనించాలి. భారతదేశం తన రూపా యి పాత్రను బలపరచడం, ఆర్థిక వ్యవస్థలను సమర్థవంతంగా నిర్వహించడం వంటి మార్గాల ద్వారా అవసరాలను తీర్చుకోవాలి. ప్రజలు, ఆర్థిక నిపుణులు, పాలసీ మేకర్లు ఈ ప్రతిపాదనపై సమగ్ర చర్చలు జరిపి, భారత ఆర్థిక ప్రయోజనాలకు అనుకూలమైన వ్యూహాలను రూపొందించాలి. ఈ విధంగా, భారతదేశం అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో మరింత శక్తివంతమైన భాగస్వామిగా మారవచ్చు.

## విద్యావ్యవస్థపై మంత్రి నారాలోకేశ కొత్త నిర్ణయం

అమరావతి, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఆర్టీజీ, మానవవనరుల శాఖా మంత్రి నారా లోకేష్ సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. డిసెంబర్ 7న తల్లిదండ్రులు–ఉపాధ్యాయుల మెగా సమావేశం నిర్వహించాలని మంత్రి నిర్ణయించారు. రాజకీయాలకు అతీతంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని లోకేష్ పిలుపునిచ్చారు. ఈ మెగా సమావేశానికి ప్రజాప్రతినిధులు, దాతలు, పూర్వ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలను ఆహ్వానిస్తూ మంత్రి లోకేష్ శుక్రవారం లేఖను విడుదల చేశారు. విద్యావ్యవస్థకు అతి పెద్ద పండుగగా రాష్ట్ర వ్యాప్తంగా డిసెంబర్ 7న నిర్వహించనున్న తల్లిదండ్రులు – ఉపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. పాఠశాలల బలోపేతానికి, విద్యార్థి వికాసానికి, సమస్యల పరిష్కారానికి దిక్సూచిగా నిలుస్తుందన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య ఓ ఆత్మీయ వారధిగా సమావేశం ఉండనుందన్నారు. దేశంలోనే తొలిసారిగా రాష్ట్రమంతా ఒకేసారి డిసెంబర్ 7న

## ప్రతీ పథకానికి రేషన్ కార్డు తప్పని సరి

అమరావతి, ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పథకాలను ప్రకటించింది. వాటిని అమలు చేయడానికి తగిన ప్రణాళికలను రూపొందించే పనిలో ఉంది. అయితే అంతకంటే ముందు ప్రభుత్వం ఓ కీలక నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది. చంద్రబాబు సర్కారు ఇప్పటి వరకు అమలు చేస్తున్న పథకాలు, లబ్ది పొందుతున్న వారికి కొత్త కండీషన్ పెట్టింది. ఇకపై రాష్ట్రంలో స్టూడెంట్స్‌కి ఫీజ్ రీయింబర్స్‌మెంట్, గృహిణులకు దీపం–2 పథకం వర్తింపజేయాలన్నా..కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు అర్హత కలిగిన ప్రతీ ఒక్కరు రేషన్ కార్డు కలిగి ఉండాలని ఏపీ ప్రభుత్వం తేల్చి చెప్పింది. అర్హులైన వాళ్లలో రేషన్ కార్డులు లేని వారికి సంక్రాంతిలోగా కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించినట్లుగా తెలుగుదేశం పార్టీ వెబ్ సైట్లో పెట్టడం జరిగింది. ప్రభుత్వం ఏదైనా సంక్షేమ పథకాలు అమలు చేయాలంటే దానికి సంబంధించి ఎవరు అర్హులు అనే విషయాన్ని గుర్తించడం ముఖ్యం. అందుకే ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఇప్పుడు మరో నిర్ణయం తీసుకుంది.రాష్ట్రంలో ఫించన్ తీసుకునే వాళ్ల దగ్గర నుంచి ఫీజ్ రీయింబర్స్‌మెంట్ విద్యార్థులు, దీపం–2 పథకం లబ్దిదారులు తప్పని సరిగా రేషన్ కార్డు కలిగి ఉండాలని నిర్ణయించింది. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏవి కావాలన్నా రేషన్ కార్డు తప్పనిసరి. ఏపీలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్రాంతి లోపు రేషన్ కార్డు ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించినట్లుగా టీడీపీ వెబ్ సైట్లో పెట్టడం జరిగింది. ఇప్పటికే ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇచ్చే ప్రక్రియను మొదలుపెట్టింది. అర్హులైన వారు డిసెంబర్ 2 నుంచి 28వ తేది వరకు అప్లై

# ఇందుగలడు..అందు లేడని లేదు..సర్వం అదానీ!

న్యూఢిల్లీ,రాజకీయంగా దేశంలో రెండవ అతి పెద్ద రాష్ట్రం మహారాష్ట్రలో భారీ విజయం సాధించటంతో భారతీయ జనతా పార్టీ శ్రేణులు ఆనందోత్సాహాలు జరుపుకుంటున్నాయి. ఇదే సమయంలో కేంద్రంలోని అధికార పార్టీకి అదానీ వ్యవహారం తల నొప్పిగా మారింది. ముఖ్యంగా ప్రధాని నరేంద్ర మోడీకి గత కొన్నేళ్లుగా అదానీ విషయంలో ప్రతిపక్షాల నుంచి అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఇప్పుడు అమెరికాలో గౌతమ్ అదానీపై క్రిమినల్ కేసు నమోదు కావటంతో ఇక్కడ ప్రధాని మోడీ పరిస్థితి ఇరకాటంలో పడ్డట్టైంది. పార్లమెంటు శీతాకాల సమావేశాల తొలిరోజే ఉభయసభల్లో గందరగోళం చెలరేగింది. దీనిపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) ద్వారా విచారణ జరిపించాలని ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. పార్లమెంటులో దీనిపై చర్చకు ప్రభుత్వం భయపడుతోందని విమర్శించింది. ఈ గందరగోళం మధ్య ఉభయ సభలు వాయిదాపడ్డాయి, తగిన వివరణ వచ్చేవరకు ఆందోళన కొనసాగిస్తామని కాంగ్రెస్ స్పష్టం చేసింది. అదానీ విషయంలో ప్రభుత్వ తీరును ఆప్, తృణమూల్ కాంగ్రెస్ వంటి ఇతర పార్టీల ఎంపీలూ తప్పుబట్టారు.అదానీ కంపెనీలు కేంద్ర బిందువుగా గత నాలుగైదు రోజులుగా దేశవ్యాప్తంగా దుమారం రేగుతున్న విషయం తెలిసిందే. ఇక, రెండు తెలుగు రాష్ట్రాలలోనూ రాజకీయం అదానీ వ్యవహారం చుట్టే నడుస్తోంది. ఏపీ, తెలంగాణలో ఇప్పుడు ఈ వ్యవహారం హాట్ టాపిక్ గా మారింది. మహారాష్ట్ర ఎన్నికల సందర్భంగా పత్రికా సమావేశంలో.. అదానీ నుంచి తెలంగాణ ప్రభుత్వం విరాళం సేకరించడంపై కొందరు పాత్రికేయులు రాహుల్‌గాంధీని అడిగారు. ఒకపక్క సీఎం రేవంత్‌రెడ్డి విరాళాలు సేకరిస్తుంటే.. మరోపక్క మీరు ఎలా అదానీ తప్పులను ప్రశ్నిస్తారని రాహుల్ వద్ద ప్రస్తావించారు. ఇది తెలంగాణలో చర్చనీయమైంది. అదానీ విషయంలో తను గతంలోనే తన వివరణ ఇచ్చానని... రాహుల్ కూడా అదానీపై తన పోరాటాన్ని స్పష్టంగా ప్రజలకు వెల్లడించారని సీఎం రేవంత్ రెడ్డి చెబుతూ వస్తున్నారు. చట్టబద్ధంగా, రాజ్యాంగబద్ధంగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఏదైనా అంశంలో టెండర్లు పిలిస్తే.. అదానీనే కాదు.. అంబానీ, టాటా, బిర్లా వంటి వారు ఎవరైనసరే.. నిబంధనల ప్రకారం ఆ టెండర్లను దక్కించుకుంటారు.. వారికి రాజ్యాంగబద్ధమైన రక్షణ ఉంటుందని, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి అవకాశం ఉంటుందని రాహుల్‌గాంధీ స్పష్టంగా వివరించారు. అయినప్పటికీ బీఆర్ఎస్ పదే పదే అదానీ విరాళం వ్యవహారాన్ని ప్రస్తావిస్తోంది. దీంతో సీఎం రేవంత్ రెడ్డి గులాబీ నేతలపై ఎదురుదాడికి దిగారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అదానీ సంస్థలతో చేసుకున్న ఒప్పందాలు చాలానే ఉన్నాయని గుర్తుచేస్తున్నారు. అంతే కాదు 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ'కి అదానీ గ్రూప్ ఇస్తాన న్న రూ.100 కోట్ల విరాళాన్ని తెలంగాణ ప్రభుత్వం స్వీకరించడానికి సిద్ధంగా లేదని సీఎం ప్రకటించారు. పక్క రాష్ట్రాలు, దేశాల్లో అదానీ గ్రూప్ కంపెనీల విషయంలో జరుగుతున్నవివాదానికి.. తెలంగాణ ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని రేవంత్ రెడ్డి స్పష్టంచేశారు. క, పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ లో కూడా అదానీ-జగన్ వ్యవహారం హాట్ టాపిక్ గా మారింది. ఈ వ్యవహారంపై అధికార టీడీపీ ఎలా వ్యవహరిస్తుంది అనేది ఆసక్తిని కలిగిస్తోంది. రాష్ట్రంలో జగన్ రాజకీయ ప్రత్యర్థి కాగా..కేంద్రంలో బీజేపీ మిత్రపక్షంగా ఉంది. మెడీ, అదానీ అత్యంత సన్నిహితులు అనే విషయం బహిరంగ రహస్యమే. ఇప్పుడు దీనిపై పార్లమెంట్లో టీడీపీ ఎలా వ్యవహరిస్తుందో చూడాల్సి వుంది. కాగా. అదానీతో ఒప్పందానికి సంబంధించి జగన్‌మోహన్‌రెడ్డి తేలుకుట్టిన దొంగలా వ్యవహరిస్తున్నారని లెఫ్ట్ పార్టీలు మండిపడుతున్నాయి. ఈ ఒప్పందం వల్ల రాష్ట్ర ప్రజలపై రూ. లక్ష కోట్ల భారం పడుతుందని విమర్శిస్తున్నాయి. ప్రతిపక్షంలో ఉండగా దీనిపై విమర్శలు చేసిన తెదేపా నాయకులు ఇప్పుడు నోరెత్తకపోవటం విచిత్రంగా ఉంది. ఒప్పందంలో రూ. 2,029 కోట్ల అవినీతి ఉందని, అందులో రూ. 1,757 కోట్లు జగన్‌కు అందినట్లు అమెరికా న్యాయవిభాగం తేల్చిన విషయం తెలిసిందే. యూనిట్ రూ. 1.99కు వచ్చే విద్యుత్తును రూ. 2.49 చొప్పున కొనడానికి ఎందుకు ఒప్పందం చేసుకున్నారనేది ఆరోపణ. టీడీపీ సర్కార్ జగన్‌పై కనీస విచారణకు సిద్ధపడకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. దీనిపై కేంద్ర ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలి. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు మౌనం వీడి జగన్‌పై చర్యలు తీసుకోవాలి. మరోవైపు, అదానీ కేసులో ఇప్పుడు మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. గౌతమ్ అదానీతో పాటు ఆయన సోదరుడి కుమారుడు సాగర్ అదానీకి యూఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (యూఎస్ ఎస్ఈసీ) సమన్లు జారీ చేసింది. సౌర విద్యుత్ కాంట్రాక్టులను పొందడానికి రూ.2,200 కోట్లు లంచం ఇచ్చారన్న ఆరోపణలపై తమకు వివరణ ఇవ్వాలని కోరింది. 21 రోజుల లోపు సమాధానం ఇవ్వాలని స్పష్టం చేసింది.నోటీసులకు స్పందించకపోతే తీర్పు వ్యతిరేకంగా వెలువడుతుందని యూఎస్ ఎస్ఈసీ హెచ్చరించింది. అదానీ వ్యవహారంలో ఆరోపణలు రుజువైతే..ఇటు ప్రజాకోర్టులో కూడాచాలా మందికి శిక్షలు తప్పవు!!

# సై అంటే సై అంటున్న టీడీపీ నేత

అమరావతి, ఇలాఖ పంచాయితీ ఇంట్రెస్టింగ్‌గా మారింది. ఏ బిడ్డా ఇది నా అడ్డా అని ఆ ఇద్దరు నేతలు రచ్చకెక్కడం పొలిటికల్ హాట్ టాపిక్ అవుతోంది. అంతటితో ఆగకుండా బూడిద రగడ రచ్చకెక్కింది. ఓ టీడీపీ నేత, బీజేపీ ఎమ్మెల్యే డస్ట్ కోసం నువ్వా నేనా అన్నట్లుగా తగ్గేదేలే అంటున్నారు. టీడీపీ నేత అయితే ఏకంగా తానే రంగంలోకి దిగుతానంటుంటే..బీజేపీ ఎమ్మెల్యే మాత్రం అనుచరులను ఫీల్డ్‌లోకి దింపి రచ్చ చేస్తున్నారు. ఆ రెండు రాయలసీమ జిల్లాల సరిహద్దుల్లో పోలీస్ పహారా..టెన్షన్ సిచ్యువేషన్స్‌తో ఆ ఇద్దరి కుస్తీ కాస్త..డిస్కషన్ పాయింట్ అవుతోంది. ఇంతకీ ఆ ఇద్దరి బూడిద గొడవ ఏంటి.? డస్ట్ వార్ సెట్ అయ్యేది ఎట్లా.?

జేసీ, ఆది వర్గాల మధ్య వివాదం..

అప్పుడు దోస్తీ.. ఇప్పుడు కుస్తీతో ఆ ఇద్దరి నేతల పంచాయితీ రచ్చ రంబోలా అవుతోంది. తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, జమ్మలమడుగు బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి మధ్య గొడవ చూస్తుంటే ఇదే అనిపిస్తుంది. రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంట్ నుంచి ఫ్లైయాష్ పౌడర్ తాడిపత్రికి తరలించే విషయంపై జేసీ బ్రదర్స్..ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి వర్గాల మధ్య వివాదం నడుస్తోంది. దీంతో నువ్వానేనా అన్నట్లుగా ఫీల్డ్‌లోకే దిగారు ఇద్దరు నేతల అనుచరులు. జేసీ ప్రభాకర్ రెడ్డి అయితే తానే రంగంలోకి వస్తానని చెప్పి హీట్ క్రియేట్ చేశారు. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాత్రం అనుచరులతోనే తతంగమంతా నడిపిస్తున్నారు.

ఫ్లైయాస్ పౌడర్ తాడిపత్రికి తరలించే విషయంపై గొడవ

%రాయలసీమ థర్మల్ పవర్ స్టేషన్‌లో ప్రతీ నిత్యం దాదాపు 4వేల టన్నుల ఫ్లైయాష్ పౌడర్ ఉత్పత్తి అవుతుంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో బూడిదను అప్పటి జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, తాడిపత్రి ఎమ్మెల్యే పెద్దారెడ్డి సిమెంటు ఫ్యాక్టరీలకు సప్లై చేసే వారట. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి వర్గీయులు బూడిద తోలుకోవడం స్టార్ట్ చేశారు. ఈ మధ్య ఆదినారాయణరెడ్డి వర్గీయులు అడ్డు చెప్పడంతో వివాదం మొదలైంది. ఆదినారాయణరెడ్డి వర్గీయులు సరఫరా చేసే బూడిదను తాడిపత్రి

# వాయు కాలుష్య కట్టడిలో వైఫల్యం

హైదరాబాద్,పెరుగుతున్న కాలుష్యాన్ని కట్టడి చేయడానికి 2019 జనవరిలో నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ (ఎన్‌సిఎపి)ను ప్రారంభించినా, గత ఐదేళ్లలో అనుకున్న ఫలితాలు సాధించలేదు. తక్కువ కాలుష్యం కలిగిన నగరాలకు ఈ పథకం కింద నిధులు భారీగా కేటాయించారు. ఈ కార్యక్రమం లక్ష్యం రోడ్డు దుమ్మును నివారించడం. అంతేతప్ప ప్రస్తుతం పీడిస్తున్న వాయు కాలుష్యం తదితర ఇతర కాలుష్యాల నివారణ ప్రసక్తి ఇందులో చేర్చలేదు. కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖ ఈ ఎన్‌సిఎపి ని ప్రారంభించింది. 2024 నాటికి కాలుష్య రేణువుల పిఎం 2.5, పిఎం 10 స్థాయిలను 2024 నాటికి 20 నుంచి 30 శాతం వరకు తగ్గించాలన్నదే ఈ పథకం లక్ష్యంగా నిర్దేశించారు. అయితే ఈ లక్ష్యాన్ని 2025 వరకు పొడిగించారు.దేశంలో వాయు నాణ్యత సూచిక 8 కాలుష్య కారకాలతో రూపొందించబడింది. అవి పిఎం 10, పిఎం 2.5, ఎన్‌ఒ 2, ఎస్‌ఒ 2, కార్బన్ మోనాక్సైడ్ (సిఒ. 03), ఎన్‌హెచ్3, పిబి తదితర కాలుష్య కారకాలను పేర్కొన్నారు. వాయు కాలుష్య ప్రధాన భాగాలు గాలిలో ఉండే పిఎం 2.5, పిఎం 10 కణాలు. ఈ కణాల స్థాయి గాలిలో పెరిగినప్పుడు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఎదురవుతుంది. వాయు నాణ్యత సూచిక 050 మధ్య ఉంటే అది మంచిగానే పరిగణిస్తారు. అలాగే 51100 మధ్య ఉంటే సంతృప్తికరంగా పరిగణిస్తారు. 101200 మధ్య ఉంటే మధ్యస్తంగా పరిగణిస్తారు. 201300 కొంత ప్రమాదకరంగా, 301400 ఉంటే మరీ ఎక్కువగా, 401500 లేదా అంతకంటే ఎక్కువ ఉంటే పరిస్థితి తీవ్రంగా పరిగణిస్తారు. ఢిల్లీలో గాలి నాణ్యత కొన్ని సార్లు 500 దాటుతుంది.పిఎం అంటే ఘన, ద్రవ కాలుష్య అణువులు గాలిలో తేలియాడుతుండడం. పిఎం 10 స్థాయి అంటే ఘనపు మీటర్‌కు 60 మైక్రోగ్రాములు కన్నా ఎక్కువగా ఉండడం. ఇలా ఉంటే గాలి నాణ్యత బాగా క్షీణించిందని అర్థం. ఈ నేపథ్యంలో ఎన్‌సిఎపి కింద 2019 నుంచి 2024 మధ్య కాలంలో వివిధ రాష్ట్రాలకు రూ. 10,595 కోట్లు కేటాయించారు. మొత్తం 131 నగరాలను లక్ష్యంగా చేశారు. ఈ కేటాయింపులో రూ. 65.3 శాతం అంటే రూ. 6922 కోట్లు వినియోగమయ్యాయి. అయినా సరే గత ఐదేళ్ల సరాసరి పర్టిక్యులేట్ మాటర్ 10 (పిఎం 10) ఇంకా సురక్షిత పరిధి 60ని మించి విస్తరించింది. ఆయా నగరాల్లో కాలుష్య కట్టడికి నిధుల వినియోగం సరిగ్గా జరగలేదు. నగరాల్లో టాప్ మూడు ముంబై రూ. 938 కోట్లు, కోల్‌కతా రూ. 846 కోట్లు, హైదరాబాద్ రూ. 551.05 కోట్లు, అత్యధికంగా నిధులు అందుకున్నాయి. క్రమంగా ఈ నగరాలు 60.2 శాతం, 79.6 శాతం, 73.8 శాతం, నిధులు వ్యయం చేశాయి.ఈ నగరాల ఐదేళ్ల వార్షిక సరాసరి పిఎం 10 స్థాయిలు ఘనపు మీటర్ గాలిలో క్రమంగా 104, 99, 85 మైక్రోగ్రాముల వంతున ఉన్నాయి. ఫరీదాబాద్‌కు రూ.73 కోట్లు, ఘజియాబాద్‌కు రూ. 136 కోట్లు, ఢిల్లీకి రూ. 42 కోట్లు నిధులు అందాయి. ఈ నగరాలు క్రమంగా 38.9 శాతం, 97.8 శాతం, 29.5 శాతం వంతున ఖర్చు చేశాయి. ఇంతేకాకుండా 131 నగరాల్లో పిఎం 10 స్థాయిలు సరాసరిన 210, 204, 200 వంతున కొనసాగుతున్నాయి. దీన్ని బట్టి వాయు నాణ్యతను కట్టడి చేయడం పెద్ద సవాలుగానే ఉంటోందని



తెలుస్తోంది. అయితే నగరాలకు కేటాయించిన ఈ నిధులు చాలా వరకు 64 శాతం వంతున రోడ్డు దుమ్మును నివారించడానికే వినియోగించినట్టు సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ 2024 జులై నివేదిక వెల్లడించింది. బయోమాస్ (పంట వ్యర్థాలు వంటివి) దహనాల నివారణకు 14.51శాతం, వాహనాల రంగానికి రూ. 12.63 శాతం, భవనాల కోసం రూ. 6 శాతం, 0.61 శాతం పారిశ్రామిక రంగానికి వెచ్చించారు.ఉత్తరాది ప్రాంతాల్లో పంట మార్పిడి విధానాల వంటివి పంట వ్యర్థాలను మండించడాన్ని కొంతవరకు తగ్గించగలుగుతాయని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ చైర్ ప్రొఫెసర్ గుఫ్రాన్‌బేగ్ సూచించారు. పారిశ్రామిక కాలుష్యం నియంత్రణకు పర్యవేక్షక వ్యవస్థ, విధానపరమైన నిబంధనలు, ప్రమాణాలు అత్యంత అవసరమని పేర్కొన్నారు. రిజిస్టర్ కాని చిన్నతరహా పరిశ్రమలు నిబంధనలు పాటించడంలో విఫలమవుతున్నాయి. అంతేకాదు భారీ పరిశ్రమలు కూడా కాలుష్య నివారణ నిబంధనలు పాటించి తగిన చర్యలు తీసుకోవడం అవసరం అని నిపుణులు సూచిస్తున్నారు. ప్రపంచం లోని అత్యంత కాలుష్య ఐదు నగరాల్లో నాలుగు దక్షిణాసియాలో ఉన్నాయని నివేదికలు చెబుతున్నాయి. అవి లాహోర్, ఢిల్లీ, ముంబై, ఢాకా. ఈ నగరాల పొలిమేరల్లోని పొలాల్లో ధాన్యాన్ని వేరు చేసిన తరువాత మిగిలిపోయిన గడ్డి వంటి వ్యర్థాలను తగులబెడుతుండడం వాయు కాలుష్య తీవ్రం కావడానికి దోహదమవుతోంది.ఈ వ్యర్థాల మంట నుంచి వచ్చే పొగమసి గాలి సాంద్రతలో 40% వరకు పేరుకుపోతోంది. దీంతో గాలిచలన వేగం తగ్గి వర్షానికి కూడా ఆటంకం ఏర్పడుతోంది. గత నవంబర్‌లో పంట వ్యర్థాల దహనాలు ఢిల్లీని ఎంత ఉక్కిరిబిక్కిరి చేశాయో మనకు తెలిసిందే. పంజాబ్, హర్యానా, సహా ఉత్తరాది రాష్ట్రాల్లో పంట వ్యర్థాల దహనం నిరాఘాటంగా సాగుతోంది. ఈ పంట దహనాలతో పాటు దీపావళి బాణసంచా కాల్పులతో ఢిల్లీతో సహా మొత్తం ఏడు నగరాల్లో కాలుష్య స్థాయి ఘనపు మీటర్‌కు 500 మైక్రోగ్రాముల స్థాయిని దాటేసింది. ఇదిలా ఉండగా ఢిల్లీలో మంగళవారం ఉదయం కాలుష్య స్థాయి 401 నుంచి 450 వరకు తీవ్ర కేటగిరీకి చేరుకుంది. అంతకు ముందు సోమవారం 294 స్థాయి రికార్డు అయింది. గత కొన్ని నెలలుగా ఢిల్లీ వంటి ఉత్తరాది నగరాల్లో వాయు కాలుష్యం తీవ్రస్థాయిలో వెంటాడుతుండడం ప్రజారోగ్యంపై విపరీత ప్రభావం చూపిస్తోంది.

# ప్రపంచ బ్యాంకు రుణం - అమరావతి రాజధాని




అమరావతి రాజధాని మొదటి దశ నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఎడిబి) సంయుక్తంగా రూ.15 వేల కోట్ల రుణ ప్రాజెక్టును ఆమోదించాయి. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వ సమక్షంలో ప్రపంచ బ్యాంకు, ఎడిబి లతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఈ ప్రాజెక్టు రుణంలో ప్రపంచ బ్యాంకు, ఎడిబి లు రెండూ రూ.6800 కోట్ల చొప్పున మొత్తం రూ.13,600 కోట్లు ఇవ్వనున్నాయి. మిగిలిన రూ.1400 కోట్లు కేంద్ర ప్రభుత్వం సమకూరుస్తుందని, ఈ అప్పుపై కేంద్ర ప్రభుత్వం గ్యారెంటీ ఇస్తుందని రాష్ట్ర ప్రభుత్వం తెలియజేసింది. రాబోయే ఐదేళ్లలో ఈ రుణాన్ని వినియోగించాల్సి ఉంటుంది. ఈ రుణంతో పాటు గృహ మరియు పట్టణాభివృద్ధి కార్పొరేషన్ (హడ్కో), జర్మనీకి చెందిన కె.ఎఫ్.డబ్ల్యు డెవలప్‌మెంట్ బ్యాంకులు కన్సార్టియంగా ఏర్పడి రూ.15 వేల కోట్లు (11 వేల కోట్లు4 వేల కోట్లు) రుణం ఇచ్చేందుకు అంగీకరించాయని ముఖ్యమంత్రి తెలియజేశారు.ప్రపంచ బ్యాంక్ రుణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు కొత్తగా అధికారంలోకి వచ్చి ఐదు నెలల్లో ప్రయత్నం చేసినది కాదు. రాష్ట్ర విభజన అనంతరం 2014లో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రపంచ బ్యాంకు నుండి రుణం సేకరించడానికి ప్రయత్నాలు ప్రారంభించింది. అయితే 2019 ఎన్నికల దగ్గరకొచ్చేసరికి టిడిపి, బిజెపిల మధ్య రాజకీయ మిత్రత్వం తెగిపోవడంతో కేంద్ర బిజెపి ప్రభుత్వం అమరావతి రాజధాని కోసం ప్రపంచ బ్యాంకుకు చేసిన రుణ విజ్ఞప్తిని జులై 2019లో ఉపసంహరించుకుంది. ఆ తరువాత వైసిపి ప్రభుత్వం మూడు రాజధానుల సమస్యను ముందుకు తీసుకురావడంతో గత ఐదేళ్లలో ప్రపంచ బ్యాంకు ముందడుగు వేయలేదు. ఇప్పుడు టిడిపి-జనసేన-బిజెపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆగమేఘాల మీద మరల ప్రపంచ బ్యాంకు రుణం కోసం పావులు కదపటం, ప్రపంచ బ్యాంకు బృందం అమరావతి రాజధాని ప్రాంతం పర్యటన చేయటం, ఎడిబి తో కలిసి రుణం ఆమోదం తెలపటం అన్నీ చక చకా జరిగిపోయాయి.రాజధాని నిర్మాణంలో ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (ఎపి సిఆర్‌డిఎ), అమరావతి అభివృద్ధి కార్పొరేషన్ సంస్థ (ఎడిసి)లు స్టేక్ హోల్డర్లుగా కీలక పాత్ర పోషించనున్నాయి. అమరావతి రాజధాని అందులో ఏమేమి నిర్మాణం కాబోతున్నాయో, నిర్మాణాలకు నిధులు ఎలా సమకూర్చుకోవాలి, పరిపాలనా విధి విధానాలు ఎలా ఉండాలి, భవిష్యత్తులో ఎలా ఉండాలో తదితర విషయాలతో ప్రపంచ బ్యాంకు 118 పేజీలతో కూడిన పర్యావరణ, సామాజిక వ్యవస్థల నివేదికను విడుదల చేసింది. అమరావతి రాజధాని అభివృద్ధికి సంబంధించి ప్రపంచబ్యాంకు తన వ్యూహాన్ని, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాల్సిన విధి, విధానాలను అభివృద్ధి నమూనాను ఈ నివేదికలో తెలియజేసింది.ఈ రుణాలు పూర్తిగా సంస్కరణలతో కూడుకున్నవి. ప్రపంచ బ్యాంకు ఆదేశించిన నమూనా ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటేనే దశల వారీగా రుణం ఇస్తున్నట్లు తెలిపింది. అలాగే అమరావతి నిర్మాణ ప్రాజెక్టుకు దీర్ఘకాలిక ప్రాతిపదికన టెక్నికల్, ఎగ్జిక్యూటివ్ కన్సల్టెంట్లను కూడా ప్రపంచ బ్యాంకు కనుసన్నల్లో నియమించాల్సి ఉంటుంది. ఈ నివేదికలో మొత్తం 53,748 ఎకరాల్లో 34,390 ఎకరాలు ల్యాండ్ పూలింగ్ ద్వారా 28,740 మంది రైతులు నుండి సేకరించినట్లు, ప్రస్తుత రాజధాని పరిధి 217 చదరపు కిలోమీటర్లు గాను ఇందులో ప్రస్తుతం ఉన్న 25 గ్రామ పంచాయతీలలో సుమారు లక్ష మంది ప్రజలు ఉన్నట్లు పేర్కొన్నది. ఈ మొత్తంలో పరిపాలనకు అవసరమైన ప్రభుత్వ కాంప్లెక్స్‌లు అనగా సీడ్ కాపిటల్ పరిధి 16.94 చదరపు కిలోమీటర్లు ఉంటుందని తెలిపింది.రాజధానిని మొత్తం 12 జోన్లుగా విభజించటంతో పాటు నివాస, వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక, హరిత ప్రాంతాలు అనే నాలుగు విభాగాలుగా ఉంటుందని తెలిపింది. వీటిలో పరిపాలన, న్యాయ, ఎలక్ట్రానిక్, నాలెడ్జ్, ఆరోగ్య, విద్య, ఫైనాన్షియల్, క్రీడా, పర్యాటక అనే తొమ్మిది నగరాలుగా నిర్మాణం జరుగుతుందని పేర్కొన్నది.మొదటిది ప్రభుత్వం చేపట్టబోతున్న అన్ని రకాల ప్రాజెక్టుల్లోనూ కార్యకలాపాల్లో ప్రైవేట్ పెట్టుబడుల భాగస్వామ్యంతో చేపట్టాలని కోరింది. ముఖ్యంగా మంచినీరు, రహదారులు, పారిశుధ్యం మురుగునీటి పారుదల, విద్యుత్, కమ్యూనికేషన్లు, పార్కులు, రిక్రియేషన్, ప్రజల ఉమ్మడి సదుపాయాల కల్పన వంటి పౌర సేవలన్నింటిలోనూ ప్రభుత్వ పెట్టుబడులతో పాటు ప్రైవేట్ పెట్టుబడుల భాగస్వామ్యం కల్పించాలని అంటే ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం (పిపిపి) కింద చేపట్టాలని కోరుతున్నది. ఉదాహరణకు అమరావతి నగరానికి రోజూ సుమారు 478 మిలియన్ లీటర్ల మంచినీరు అవసరమని పేర్కొన్నది. ఈ మంచినీటి ప్రాజెక్టును పిపిపి కింద చేపట్టాల్సి ఉంటుంది. అలాగే దీని నిర్వాహణకు ప్రత్యేక రెగ్యులేటరీ నీటి బోర్డు ఏర్పాటు చేసి ఈ ప్రాజెక్టును నిర్వహించాలి. దీని ఆపరేషన్ అండ్ మెయింటినెన్స్‌ను పూర్తిగా ప్రైవేట్ సంస్థకి అప్పజెప్పాలి. మంచినీటి చార్జీలను పూర్తిగా ఈ సంస్థే నిర్ణయిస్తుంది. అలాగే పారిశుధ్యం, మురుగు నీటి నిర్వహణ ఇలా అనేక పౌర సేవలు పూర్తిగా ప్రైవేట్ సంస్థల కిందే అమలు చేయబడతాయి. దీనిని బట్టి అమరావతి రాజధాని నగరంలో ఏర్పడబోయే సదుపాయాలు ఎవరికోసమో అర్థం చేసుకోవచ్చు.రెండోది రాజధాని నిర్మాణానికి అవసరమైన నిధులను ప్రైవేట్ మార్కెట్ల నుండి కూడా రుణాల రూపంలో సేకరించుకోవాలని కోరింది. ఇందులో మున్సిపల్ బాండ్ల రూపంలో రుణాలు సేకరించుకోవడం ముఖ్యమైనది. గతంలో చంద్రబాబు నాయుడు అధికారంలో ఉన్నప్పుడు కూడా అమరావతి బాండ్లు విడుదల చేసి రూ.2 వేల కోట్లు రుణాలు సేకరించారు. ఈ బాండ్ల రుణాల ద్వారా చేపట్టబోయే ప్రాజెక్టులు పిపిపి కింద చేపట్టటంతో పాటు దానిని వ్యాపార పద్ధతిలో నడపాల్సి ఉంటుంది. పన్నులు ఎంత విధిస్తారో, తీసుకున్న రుణాలను ఎలా ఆ ప్రాజెక్టు ద్వారా తీరుస్తారో, ప్రత్యేక ఎస్క్రో అకౌంట్ల ఏర్పాటు మొదలగునవి ముందుగా తెలియజేయాల్సి ఉంటుంది. ఈ తరహా మౌలిక సదుపాయాలు, పౌర సేవలన్నీ వాణిజ్య పరమైనవిగా ఉంటాయి. బిజెపి అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి బాండ్ల రూపంలో మున్సిపల్ సంస్థలు రుణాలు సేకరించుకుంటేనే కేంద్ర ప్రభుత్వ నిధులు పొందేందుకు అర్హత ఉంటుందని ఆంక్షలు విధిస్తున్నది. దీనికోసం ముందుగా మున్సిపల్ సంస్థలు స్టాక్ ఎక్స్ఛేంజ్ లలో నమోదు కావాలని, ప్రైవేట్ సంస్థల వలేట క్రెడిట్ రేటింగ్ ర్యాంకులు పొందాలని ఒత్తిడి చేస్తున్నది. ఇప్పుడు వీటన్నిటికీ ప్రయోగశాలగా అమరావతి రాజధాని కాబోతున్నది.మూడోది రాజధాని కోసం సేకరించిన భూమిని పూర్తిగా వ్యాపార సరుకుగా మార్చాలని కోరుతున్నది. ఈ భూమిని వివిధ ప్రైవేట్ వ్యాపార, వాణిజ్య సంస్థలకు కేటాయించి తద్వారా పెట్టుబడుల ఫైనాన్సింగ్‌ను సమకూర్చుకొని రాజధాని నిర్మాణానికి వినియోగించుకోవాలని ఆదేశిస్తున్నది. అయితే ఈ నమూనాలో ప్రజల ఉమ్మడి ప్రయోజనాలు ఉండవు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఈ భూమిని బడా పెట్టుబడిదారులకు కేటాయించే పనిలో చురుగ్గా ఉంది.నాలుగోది పట్టణ స్థానిక సంస్థ (అమరావతి మున్సిపల్ కార్పొరేషన్) ఎలా ఏర్పాటు చేయాలి? అందులో పౌర సేవలు నిర్వహణ ఎలా ఉండాలి?

# ఢిల్లీలో పెరిగిన చలి తీవ్రత

న్యూఢిల్లీ, దేశరాజధాని ఢిల్లీలో చలి తీవ్రత పెరిగింది. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. గురువారం ఉదయం అత్యంత శీతలమైన పరిస్థితులు నెలకొన్నాయి. భారత వాతావరణ శాఖ ప్రకారం.. ఢిల్లీలో గురువారం ఉదయం ఉష్ణోగ్రతలు 10.1 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. సాధారణం కంటే 0.2 డిగ్రీలు తక్కువగా నమోదైంది. ఈ సీజన్‌లో ఇంత తక్కువ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు కావడం ఇదే తొలిసారి అని ఐఎండీ తెలిపింది. మరోవైపు ఇవాళ ఢిల్లీలో గరిష్ట ఉష్ణోగ్రతలు 26 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేసింది. వాయువ్య దిశ నుంచి వీస్తున్న గాలులే ఉష్ణోగ్రతలు తగ్గడానికి కారణమని ఐఎండీ తెలిపింది. శుక్రవారం నాటికి 10 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేసింది. ప్రస్తుతం ఢిల్లీ వాసులు చలి తీవ్రతకు గజగజ వణుకుతున్నారు. చలికి తోడు ప్రస్తుతం రాజధాని ప్రాంతంలో కాలుష్య స్థాయిలు కూడా అధికంగానే ఉన్నాయి. నగరాన్ని దట్టమైన పొగమంచు కమ్మేసింది. కాలుష్య నియంత్రణ మండలి డేటా ప్రకారం.. గురువారం ఉదయం 9 గంటల సమయానికి ఢిల్లీ ఎన్సీఆర్‌లో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 313గా నమోదైంది. ఇది చాలా పేలవమైన కేటగిరీ కిందకు వస్తుంది.

# 1500 అధికారులకు సామాజిక పెన్షన్...

తిరువనంతపురం,వృద్ధులు, వికలాంగుల వంటి సమాజంలోని బలహీన వర్గాలకు ఇచ్చే సామాజిక భద్రత పింఛన్‌ను ప్రభుత్వ అధికారులు పొందుతున్నారు. వారికి వచ్చే జీతంతోపాటు సర్కారు నుంచి వచ్చే రూ.1600 కూడా అక్రమంగా అందుకుంటున్నారు. కేరళలలో 1498 మంది ప్రభుత్వ ఉద్యోగులు సామాజిక పెన్షన్ అందుకుటున్నట్లు గుర్తించారు. వారిలో గెజిటెడ్ అధికారులు, కాలేజీ ప్రొఫెసర్లు కూడా ఉన్నారు. అర్హులైన వారికి మాత్రమే పింఛను అందేలా చూడాలని ఆర్థిక శాఖ ఆదేశాల మేరకు ఇన్ఫర్మేషన్ కేరళ మిషన్ నిర్వహించిన ఆడిట్‌లో ఈ అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. కేరళ ప్రభుత్వం రాష్ట్రంలోని వివిధ వర్గాలకు చెందిన దాదాపు 62 లక్షల మందికి నెలవారీ పెన్షన్‌గా రూ.1,600 అందిస్తున్నది. కాగా, అక్రమాల నేపథ్యంలో నిబంధనలకు విరుద్ధంగా పెన్షన్ పొందిన ఉద్యోగుల నుంచి వడ్డీతో సహా వసూలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతోపాటు సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్థిక మంత్రి కేఎన్ బాలగోపాల్ ఆదేశించారు. అనర్హులను గుర్తించేందుకు తదుపరి పరిశీలన కొనసాగుతుందని వెల్లడించారు. సంక్షేమ వ్యవస్థ సమగ్రతను కాపాడుతూ అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీకి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇలాంటి మోసాలను వెలికితీసేందుకు వివిధ స్థాయిల్లో తనిఖీలను ఇకపై కొనసాగిస్తామని చెప్పారు.

# ఇజ్రాయెల్- హిజ్బొల్లా కాల్పుల విరమణ ఒప్పందం

ఇజ్రాయెల్, హిజ్బొల్లా మధ్య 13 నెలల పోరాటానికి తెరపడింది. ఇరు వర్గాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ప్రకటించారు.ఈ ఒప్పందం బుధవారం నుంచి అమలులోకి వచ్చింది. లెబనాన్‌లో పోరాటాన్ని నిలిపివేసి, 'హిజ్బొల్లా, ఇతర ఉగ్రవాద సంస్థల నుంచి ఇజ్రాయెల్‌ను రక్షించడం' ఈ ఒప్పందం లక్ష్యం అని యుఎస్, ఫ్రాన్స్ సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. 'శాశ్వత కాల్పుల విరమణ' లక్ష్యంగా ఈ ఒప్పందం జరిగిందని బైడెన్ ప్రకటించారు. ఒప్పందంలో భాగంగా, 60 రోజులలో హిజ్బొల్లా బ్లూ లైన్ (లెబనాన్, ఇజ్రాయెల్ మధ్య అనధికారిక సరిహద్దు), లిటాని నదికి (ఉత్తర దిశకు సుమారు 30 కి.మీ దూరం) మధ్య ఉన్న ప్రాంతం నుంచి తన్న ÷ఫైటర్లను, ఆయుధాలను తొలగిస్తుంది. లెబనాన్ సైన్యం ఆ ప్రాంతాన్ని ఆధీనంలోకి తీసుకుంటుంది. ఆయుధాలు, సైనిక నిర్మాణాలు తొలగిస్తారు, వాటిని మళ్లీ అక్కడ పునర్నిర్మించకుండా చూసుకుంటాయి. అదే 60 రోజులలో ఇజ్రాయెల్ నెమ్మదిగా తన దళాలను, పౌరులను అక్కడి నుంచి ఉపసంహరించుకుంటుంది. సరిహద్దుకు ఇరువైపులా ఉన్న ప్రజలు తమ ఇళ్లకు తిరిగి రావడానికి ఇది వీలు కల్పిస్తుందని బైడెన్ చెప్పారు.అమెరికా అధికారి ప్రకారం.. దక్షిణాన హిజ్బుల్లా స్థానంలో ఐదు వేల మందితో కూడిన లెబనాన్ దళాలను మోహరించడం ఈ ఒప్పందంలో ఉంది. అయితే, దీని గురించిన దోళనలు ఉన్నాయి. లెబనాన్ సైన్యం కాల్పుల విరమణను ఎలా అమలు చేస్తుంది? అవసరమైతే అది హిజ్బొల్లాతో తలపడుతుందా? ఇది బలమైన మత, జాతి సమూహ విభేదాలున్న దేశంలో పరిస్థితిని మరింత దిగజార్చవచ్చు. అయితే, ఒప్పందం ప్రకారం బాధ్యత లను పూర్తిగా నెరవేర్చడానికి తమ వద్ద తగినంత నిధులు, సిబ్బంది, సామగ్రి లేవని లెబనాన్ సైన్యం పేర్కొంది. కాగా, మిత్రదేశాల సహాయంతో లెబనాన్‌కు ఈ సమస్య నుంచి సడలింపు దొరకవచ్చు. హిజ్బొల్లా ప్రస్తుతం బలహీనంగా ఉందని చాలామంది పాశ్చాత్య అధికారులు అంటున్నారు. మొత్తం దేశంపై నియంత్రణను తిరిగి పొందడానికి లెబనాన్ ప్రభుత్వానికి ఇది అవకాశంగా మారింది.ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తీర్మానం 1701పై ఆధారపడి ఈ ఒప్పందం జరిగింది. ఇదే 2006లో ఇజ్రాయెల్, హిజ్బొల్లా మధ్యన జరిగిన యుద్ధాన్ని ముగించింది. 1701 తీర్మానం ప్రకారం, లిటాని నదికి దక్షిణాన ఉన్న ప్రాంతంలో లెబనీస్ ప్రభుత్వ, యూఎన్ శాంతి పరిరక్షక దళం (యునిఫిల్) మినహా ఎలాంటి సాయుధ గ్రూపులు లేదా ఆయుధాలు ఉండకూడదు. అయితే, ఈ నిబంధనలను ఉల్లంఘించారని ఇరువర్గాలు పరస్పరం ఆరోపణలు చేసుకున్నాయి. హిజ్బొల్లా అక్కడ మౌలిక సదుపాయాలను నిర్మించిందని ఇజ్రాయెల్ వాదిస్తోంది. తమ భూభాగంపై సైనిక విమానాలు తీసుకొచ్చి ఇజ్రాయెల్ తీర్మానాన్ని ఉల్లంఘించిందని లెబనాన్ అంటోంది. ఈసారి ఉల్లంఘనలను గుర్తించడానికి యునిఫిల్, లెబనాన్, ఇజ్రాయెల్‌లతో కూడిన ప్రస్తుత పర్యవేక్షణ వ్యవస్థలో అమెరికా, ఫ్రాన్స్ చేరుతాయని యుఎస్ అధికారి ఒకరు తెలిపారు. మరోవైపు, అమెరికా మద్దతుతో లెబనాన్‌లో స్వేచ్ఛగా సైనిక చర్య తీసుకునే హక్కు ఇజ్రాయెల్‌కు ఉందని ప్రధాని నెతన్యాహు అన్నారు. 'ఒప్పందాన్ని ఉల్లంఘించి, హిజ్బొల్లా ఆయుధాలు పొందడానికి ప్రయత్నిస్తే.. మేం దాడి చేస్తాం. సరిహద్దుల్లో ఉగ్రవాద కేంద్రాలను పునర్నిర్మిస్తే దాడులు చేస్తాం. అది రాకెట్లను ప్రయోగించినా, సొరంగాలు తవ్వినా, రాకెట్లతో ట్రక్కులను తీసుకువచ్చినా దాడి చేస్తాం' అని ఆయన అన్నారు. 'హిజ్బొల్లా లేదా మరెవరైనా ఒప్పందాన్ని ఉల్లంఘించి ఇజ్రాయెల్‌కు ముప్పు తలబెడితే అంతర్జాతీయ చట్టం ప్రకారం తనను తాను రక్షించుకునే హక్కు ఇజ్రాయెల్‌కు ఉంది' అని బైడెన్ మీడియా ప్రతినిధులతో చెప్పారు. ఈ ఒప్పందం లెబనాన్ సార్వభౌమత్వాన్ని గౌరవిస్తుందని కూడా ఆయన అన్నారు.

## లగచర్ల భూసేకరణ నిలిపివేత

హైదరాబాద్, గిరిజన, దళిత పేద రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ చేసిన పోరాటంతో రేవంత్ రెడ్డి సర్కార్ దిగొచ్చింది. లగచర్ల భూసేకరణను నిలిపివేసింది. ఈ మేరకు శుక్రవారం నాడు ఒక ప్రకటన విడుదల చేసింది.

# 6 నెలల్లోనే బండారు శ్రావణి కథ రివర్స్




అమరావతి,ఆమె తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. యువ నాయకురాలు, ఇంకేముంది నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తారనుకున్నారు. అయితే అభివృద్ధి సంగతేమో కాని వివాదాల్లో మాత్రం ఆ నియోజకవర్గం, ఆ యువ నాయకురాలు తెగ ఫోకస్ అవుతున్నారు. తెలిసి చేస్తున్నారో, లేదా తెలియక చేస్తున్నారో తెలియదు కానీ వివాదాలు మాత్రం వీడడం లేదు. ఇంతకీ ఎవరా యువ ఎమ్మెల్యే? అంటారా వాచ్ దిస్ స్టోరీ.ఉమ్మడి అనంతపురం జిల్లాలో సింగనమల నియోజకవర్గానికి ఒక ప్రత్యేకమైన సెంటిమెంట్ ఉంది. ఇక్కడ ఎవరు గెలిస్తే ఆ పార్టీని పైన అధికారంలోకి వస్తుందని సెంటిమెంట్ ఉండేది. గత 30 ఏళ్లుగా అదే సెంటిమెంట్ వర్క్ అవుట్ అవుతూ వస్తోంది. కాంగ్రెస్ అధికారంలో ఉండగా శైలజానాథ్ కాంగ్రెస్ అభ్యర్థిగా ఇక్కడ నుంచి ప్రాతినిధ్యం వహించారు. ఆ తర్వాత టిడిపి నుంచి శమంతకమణి, ఆమె కుమార్తె యామిని బాల మంత్రులుగా , ఎంఎల్ఏ లుగా ప్రాతినిధ్యం వహించారు. ఆ తర్వాత 2019 లో వైసీపీ నుంచి జొన్నలగడ్డ పద్మావతి ఎమ్మెల్యేగా గెలిచారు. 2టిడిపి నుంచి అప్పటికే ఒకసారి ఓడిపోయిన బండారు శ్రావణి 2024 ఎన్నికల్లో మంచి మెజార్టీతో తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఎన్నికల ముందు వరకు ఆమెకు అన్ని కలిసి వచ్చాయి. 2019 ఎన్నికల్లో ఓడిపోవడం ఆ తర్వాత నారా లోకేష్ సమక్షంలో ఇచ్చిన హామీ మేరకు కీలక నాయకులు అంతా కలిసి పని చేయడం ఆమెకు ప్లస్ అయ్యాయి. అయితే నియోజకవర్గాన్ని పట్టించుకోవడం మానేసిన శ్రావణి వివాదాల్లో మాత్రం ముందుంటున్నారు. గెలిచినప్పటి నుంచి పట్టుమని నెల రోజులు కూడా నియోజకవర్గంలో లేరని హైదరాబాద్‌కు పరిమితం అయ్యారని సింగనమల టీడీపీ వర్గాలు గగ్గోలు పెడుతున్నాయి.ఆమె నియోజకవర్గానికి దూరమవ్వడంతో పెత్తనమంతా బండారు శ్రావణి కుటుంబ సభ్యులు చేస్తున్నారని పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇక టూ మెన్ కమిటీతో విభేదాలు కూడా ఆమెకు నెగిటివ్‌గా మారుతున్నాయి. రేషన్ షాపుల కేటాయింపు, ఫీల్డ్ అసిస్టెంట్, యానిమేటర్లు పదవుల కోసం టూ మెన్ కమిటీ వర్సెస్ శ్రావణి గా రచ్చ సాగుతుందట. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కావస్తున్నా ఇంకా ఇప్పటివరకు కూడా ఆ పోస్టులనియామకం జరగలేదని టాక్ వినిపిస్తోంది. ఆ క్రమంలో ఇటీవల జరిగిన సమన్వయ కమిటీ సమావేశానికి ఎమ్మెల్యే శ్రావణి కాకుండా కాకుండా ఆమె తల్లి లీలావతి హాజరవ్వడం పెద్ద దుమారం రేపింది.నియోజకవర్గాన్ని పూర్తిగా గాలికి వదిలేసిన ఎమ్మెల్యే హైదరాబాద్‌లో ఉంటుండటం తీవ్ర విమర్శల పాలవుతుంది. ఎవరైనా మొదటిసారి ఎమ్మెల్యే అయితే నియోజకవర్గం లో ఉండి పూర్తిగా పట్టు సాధించుకోవాలని చూస్తారు. కానీ శ్రావణి మాత్రం నియోజకవర్గానికి చుట్టపు చూపుగా వస్తుండటం ఇక్కడ క్షేత్రస్థాయిలోని పదవులు పంపకాన్ని కూడా పట్టించుకోకపోవడంపై టిడిపి కార్యకర్తలు అసహనంతో ఉన్నారు. ఎమ్మెల్యే మాత్రం తనకు ఆరోగ్యం బాలేక పోవడం వల్ల హైదరాబాదులో ఉండవలసి వస్తుందని ఇన్ఫెక్షన్ ఎక్కువైన కారణంగా నగరంలో రెస్ట్ తీసుకుంటున్నానని సన్నిహితులతో చెప్పిస్తున్నారు.ఇక ఇటీవల జరిగిన జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో సింగనమల ఎమ్మెల్యే, ఆమె కుటుంబ సభ్యులు వ్యవహరిస్తున్న తీరు పైనే ఎక్కువ ఫిర్యాదులు అందాయట. 30ఏళ్లుగా పార్టీకి కష్టపడి పని చేస్తే ఇప్పుడు కనీసం మమ్మల్ని పట్టించుకోవడం లేదని నియోజకవర్గంలోని కీలక నేతలంతా ఇన్చార్జి మినిస్టర్ టీజీ భరత్ కు , జిల్లా మంత్రి పయ్యావుల కేశవ్ కు కంప్లయింట్ చేశారట. ముఖ్యంగా టూ మెన్ కమిటీ సభ్యులైన మంతిమడుగు కేశవరెడ్డి, ఆలం నరసానాయుడు ఎమ్మెల్యే బండారు శ్రావణి తీరుపై మండిపడ్డారట.శ్రావణిపై అధిష్టానానికి సైతం ఫిర్యాదు చేయడానికి స్థానిక నేతలు సిద్ధమవుతున్నారు. 2019 లో ఓడిపోయిన తర్వాత శ్రావణి పార్టీ సభ్యత్వాల గురించి కూడా పట్టించుకోలేదని. అలాంటి సమయంలో తాము సొంత డబ్బులతో సభ్యత్వాలు చేయించామని స్థానిక నేతలు సమన్వయ కమిటీ సమావేశంలో వాపోయారు.తీరా ఇప్పుడు కనీసం తమకు గౌరవం దక్కడం లేదని ఇదంత బండారు శ్రావణి కావాలనే చేస్తున్నారని వారు విమర్శలు చేశారట. కనీసం కష్టపడ్డ వారికి క్షేత్రస్థాయిలో డీలర్, ఫీల్డ్ అసిస్టెంట్ లాంటి పదవులు కూడా ఇప్పించుకోలేకపోతున్నామని వాటి విషయంలో కూడా ఎమ్మెల్యే తన సొంత మనుషులకే ప్రాధాన్యత ఇస్తున్నారని వాపోయారంట.ఇటీవల ఎమ్మెల్యే బండారు శ్రావణి పీఏసీ ఎన్నికల్లో సైతం ఓటు వేయకుండా ఎక్కడికో వెళ్లి అధిష్టానానికి కోపం తెప్పించారట. అంతేకాదు శాసనసభ చివరి రోజు టిడిపి మహిళా ఎమ్మెల్యేలంతా కలిసి గ్రూప్ ఫోటో దిగితే శ్రావణి కనిపించ లేదు. మరలాంటివిడకు రాజకీయాలు ఎందుకని టీడీపీ కేడర్ మండి పడుతుంది.

# 8 మంది బీజేపీ ఎమ్మెల్యేల్లో జంప్ అయ్యేది ఎవరు?



హైదరాబాద్,తెలంగాణ బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు హస్తిన బాట పట్టారు. వారికి ప్రధాని మోడీ అపాయింట్మెంట్ ఇచ్చారా..? లేక ట్రీట్మెంట్ చేయడానికి పార్టీ పెద్దలుపిలిచారా..? రాజసింగ్ సైతం ఢిల్లీ పయనం అయ్యారంటే లెక్కలేవో సరి చేసే పనిలో అధిష్టానం ఉందా..? కొత్త పాత నేతల పంచాయితీ వల్ల గెలిచిన ప్రజా ప్రతినిధులు పార్టీకి దూరమవుతారనే రిపోర్ట్స్ అధిష్టాన పెద్దలకు ఏమైనా అందయా..? అందుకే బ్రెయిన్ వాష్ చేయడానికి పిలిపించుకున్నారా..? మోడీ అపాయింట్‌మెంట్ వెనక రాష్ట్ర పార్టీ అధ్యక్షుడి నియామకం లెక్కలు తేలుస్తారా?రాష్ట్ర బీజేపీ మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తోందా? అంటే ఔననే సమాధానం వస్తుంది.. తెలంగాణలో ప్రత్యామ్నాయం తామే, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది మేమే, తెలంగాణ ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని బీజేపీ నేతలు ప్రకటనలు ఇస్తున్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా అధికారం చేపట్టేది మేమే అంటూ బీజేపీ నేతలిస్తున్న స్టేట్ మెంట్లు గ్లోబల్ ప్రచారంలా ఉన్నాయన్న చర్చ పొలిటికల్ సర్కిల్లోనే కాదు, ఆపార్టీ సానుభూతిపరుల్లోనూ జరుగుతుండటం గమనార్హం. అందుకు గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాలే నిదర్శనమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.మిషన్ 90 లక్ష్యంగా, బీసీ ముఖ్యమంత్రి నినాదంతో అసెంబ్లీ ఎన్నికల బరిలో దిగిన బీజేపీ తెలంగాణలో 8 స్థానాలకు పరిమితం అయ్యింది. ఇక దేశ వ్యాప్తంగా పార్లమెంట్ ఎన్నికల్లో చార్ సౌలక్ష్యంతో, మోడీ ఫిర్ ఎక్ బర్ నినాదంతో హడావుడి చేసిన బీజేపీ కేవలం 240 కే పరిమితం కావాల్సి వచ్చింది. తెలంగాణలోనూ డబుల్ డిజిట్ పార్లమెంట్ స్థానాలు సాధిస్తామని చెప్పుకున్న కాషాయ నేతలు 8 స్థానాలే దక్కించుకోగలిగారు. అలా అనుకున్న లక్ష్యాలను అందుకోవడంలో పూర్తిగా విఫలం అయినప్పటికి ఆ పార్టీ నేతలు నేటికి అదే స్లోగన్స్, అవే గ్లోబల్ ప్రచారం, అదే మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తుండటం చర్చనీయంశంగా మారుతోంది.ఎన్నికల వైఫల్యాలు అటుంచుతే, గత ఎన్నికలే రాష్ట్ర బీజేపీలో కొత్త కుంపట్లను రగిలించాయి. కొత్త, పాత నేతల పంచాయితీ పీక్ స్టేజ్ కి చేరి, కీలక నేతలు పార్టీకి దూరమవడానికి కారణమయ్యిందనే టాక్ వుంది. రాష్ట్రంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ప్రత్యామ్నాయం తామే అని హడావుడి చేసిన కాషాయపార్టీ ఎప్పటికప్పుడు బొక్క బోర్లా పడుతూనే ఉంది. ఇప్పటికే కొత్త, పాత నేతల పంచాయితి రాష్ట్ర బీజేపీలో సైలెంట్ గా ముదురుతుంది. ఇక గత ఎన్నికల్లో ఊహించని వారంతా విజయం సాధించారు.గెలుస్తారని ఎక్స్పెక్ట్ చేసినవారంతా ఓటమి పాలయ్యారు. ఏలేటి మహేశ్వర్ రెడ్డి, రాజాసింగ్ మినాహిస్తే అంతా కొత్త ముఖాలే ఎమ్మెల్యేలుగా ఉన్నారు. రాజాసింగ్ మినాహాయిస్తే ఏలేటితో సహా మిగితా ఏడుగురు పార్టీకి సంబంధం లేని కొత్త వారే. ఇక పార్లమెంట్ సభ్యుల పరిస్థితి కూడా అలాగే కనిపిస్తుంది.గెలిచిన ఎనిమంది ఎంపీల్లో ఇద్దరు కేంద్ర మంత్రులుగా ఉన్న కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను మినహాయిస్తే అందరూ పార్టీకి కొత్తవారే. అలా గెలిచిన వారిని కూడా రాష్ట్ర నాయకత్వం నిలబెట్టుకుంటుందా? లేదా ? అనే అంశం చర్చల్లో నలుగుతుంది. కొత్తగా పార్టీలోకి వచ్చిన వారితో రాష్ట్ర నాయకత్వం వ్యవహరిస్తున్న తీరే ఆ అనుమానాలకు తావిస్తుందంటున్నారు.కొత్త నేతలెవరైనా పార్టీలోకి వస్తే అంత తొందరగా జీర్ణించుకోలేని మనస్తత్వం పాతనేతల్లో బలంగా కనిపిస్తుంది. పాత నేతల వైఖరి కారణంగానే బీజేపీలో చేరిన కీలక నేతలంతా పార్టీకి దూరమయ్యారన్న అభిప్రాయం ఉంది. ఇక గెలిచిన ఎమ్మెల్లేలను, ఎంపీలను సరిగ్గా చూసుకుంటారాంటే అదీ లేదు. వారిని డీల్ చేసే విషయంలో రాష్ట్ర నాయకత్వం అనుసరిస్తున్న తీరు విమర్శలపాలవుతుంది. కనీసం ఇప్పటి వరకు ఫ్లోర్ లీడర్ కు పార్టీ ఆఫీసులో ఛాంబర్ కేటాయించ లేదు.ఎమ్మెల్యేలు, ఎంపీలు, రాష్ట్ర నాయకత్వం మధ్య సమన్వయం పూర్తిగా కొరవడింది. ఆ క్రమంలో కొత్త, పాత నేతల పంచాయితీలతో నేతలతో పాటు క్యాడర్‌లో కూడా గందరగోళం నెలకొంటుంది. అసెంబ్లీలో ఫ్లోర్ లీడర్‌గా పార్టీలోకి కొత్తగా వచ్చిన ఏలేటిని ఎలా నియమిస్తారని పార్టీలోని పాత నేతలు ఇప్పటికీ సన్నాయి నొక్కులు నొక్కుతూనే ఉన్నారు. ఏలేటి కూడా అందర్నీ సమన్వయం చేసుకోవడంలో విఫలమవుతుండటంతో.. ఎనిమిది మంది ఎమ్మెల్లేలు ఎనిమిది దిక్కులన్నట్టు వ్యవహారం నడుస్తోంది.అటు కొత్త పాత నేతల పంచాయితీ, ఇటు ఎంపీలు, ఎమ్మెల్లేలు వర్సెస్ రాష్ట్ర నాయకత్వం మధ్య గ్యాప్. మరోవైపు ఎమ్మెల్లేలు వర్సెస్ ఎమ్మెల్లేలు, ఇంకోవైపు అధ్యక్ష కుర్చీ పీకులాట వంటి తగాదాలు రాష్ట్ర బీజేపీని అధోగతి పాలు చేస్తున్నాయని పార్టీ వర్గాలు వాపోతున్నాయి. రాష్ట్రంలో ప్రస్తుతమున్న పరిస్థితుల్లో ఇతర పార్టీల కీలక నేతలంతా కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీ నుంచి సైతం కీలక నేతలు పార్టీ వీడుతున్నారనే సంకేతాలు ఏమైనా ఉన్నాయా..? ఆ సంకేతాలు అధిష్టానానికి అందాయా? అందుకే బీజేపీ ఎమ్మెల్యేలలు, ఎంపీలకు బ్రెయిన్ వాష్ చేసేందుకే మోడీతో అపాయింట్మెంట్ ఫిక్స్ చేశారా..? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

# కాంగ్రెస్‌ను అవే దెబ్బకొట్టాయ్.. ఇలాగైతే కష్టమే

దిల్లీ: మహారాష్ట్ర, హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో ఊహించని దెబ్బ తగలడంపై కాంగ్రెస్ లోతుగా విశ్లేషిస్తోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం దిల్లీలో జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో అంచనాలను అందుకోలేని రీతిలో ఉన్న పనితీరే పార్టీకి పెద్ద సవాల్‌గా మారుతోందన్నారు. పార్టీలో ఐక్యత లేకపోవడం, ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం వంటివి ఎన్నికల్లో కాంగ్రెస్‌ను దెబ్బకొట్టాయని, ఈ విషయంలో కఠిన క్రమశిక్షణ అవసరమన్నారు. కలిసికట్టుగా పోరాడకుండా, ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటుంటే ప్రత్యర్థులను ఎలా ఓడించగలం? అని ప్రశ్నించారు. కఠిన నిర్ణయాలు తీసుకోవడం అవసరమన్న ఖర్గే.. ఈ ఫలితాల నుంచి ఇప్పటికైనా పాఠాలు నేర్చుకోవాలని పార్టీ నేతలకు సూచించారు.




క్రమశిక్షణే ఆయుధం

“పార్టీలో క్రమశిక్షణ ఎంతో ముఖ్యం. ఎట్టి పరిస్థితుల్లో అందరం ఐక్యంగా ఉండాలి. ఇదే మన ఆయుధం. పార్టీ విజయమే తమ గెలుపు అని ప్రతిఒక్కరూ అనుకోవాలి. పార్టీ బలంపైనే మన శక్తి ఆధారపడి ఉంటుందని భావించాలి. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తన పనితీరుతో నూతనోత్సాహంతో పునరాగమనం చేసింది. మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు మాత్రం పార్టీ ఆశించినట్లుగా లేవు. ‘ఇండియా‘ కూటమి పార్టీలు నాలుగు రాష్ట్రాలకు గాను రెండు రాష్ట్రాల్లో ప్రభుత్వాలను ఏర్పాటు చేశాయి. కానీ మన పనితీరు ఆశించిన విధంగా లేదు. ఇది భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీకి సవాల్‌గా మారతుంది”

ఈవీఎంలతో ఎన్నికల ప్రక్రియ అనుమానాస్పదం!

“సమయానుకూలంగా వ్యూహరచన చేసి పార్టీని బలోపేతం చేసేందుకు నేతలంతా మరింతగా కష్టపడాలి. అసెంబ్లీ ఎన్నికలకు ఏడాది ముందు నుంచే సిద్ధం కావాలి. ఓటర్ల జాబితాలను పరిశీలించాలి. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు ఎన్నికల ప్రక్రియను అనుమానాస్పదంగా మార్చాయి. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా జరిగేలా ఈసీ వ్యవహరించాలి. లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలో మహావికాస్ అఘాడీకూటమి సాధించిన ఫలితాల తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఫలితాలు చూసి రాజకీయ విశ్లేషకులు కన్ఫ్యూజన్‌లో ఉన్నారు”

ఈ ఫలితాలు మనకు కుదుపే..

“ఎన్నికల వ్యూహాన్ని కాంగ్రెస్ మెరుగుపరుచుకోవాలి. క్యాంపెయిన్‌ను మెరుగుపరిచేందుకు, తప్పుడు సమాచారాన్ని ఎదుర్కోవడానికి మెరుగైన మార్గాలను అభివృద్ధి చేసుకోవాలి. దేశవ్యాప్తంగా ప్రజల ఎజెండాను అమలు చేసేందుకు కాంగ్రెస్ అధికారంలోకి రావడం చాలా ముఖ్యం. లోక్‌సభ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించిన తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఫలితాలు మాకు పెద్ద కుదుపే. ఇందుకు కఠినమైన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఈ ఫలితాలతో నిరాశ చెందడం కాకుండా.. పార్టీని బలోపేతం చేసేందుకు క్షేత్రస్థాయి నుంచి ఏఐసీసీ వరకు మార్పులు తీసుకురావాలి” అని ఖర్గే సూచించారు.


# అబద్ధాల్లో జగన్‌కు ఆస్కార్ ఇవ్వొచ్చు




అమరావతి,అబద్ధాలను అందంగా అల్లటంలో మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి ఆస్కార్ అవార్డు ఇవ్వాల్సిందే అని ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి ఎద్దేవా చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడిన షర్మిల.. జగన్ వ్యాఖ్యలపై పలు ప్రశ్నలు సంధించారు. శాలువలు, సన్మానాలు, అవార్డులు కోరుకొనే ముందు జగన్ కొన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 2021, మే నెలలో సెకీ వేసిన వేలంలో యూనిట్ ధర గరిష్టంగా రూ. 2.14 పైసలు ఉంటే, తమరు రూ. 2.49 పైసలకు కొన్నందుకు శాలువలు కప్పాలా అంటూ వ్యాఖ్యలు చేశారు. “అదానీ వద్ద గుజరాత్ రాష్ట్రం యూనిట్ ధర రూ 1.99 పైసలకే కొంటే.. అదే కంపెనీ నుంచి 50పైసలు ఎక్కువ పెట్టి, రూ. 2.49 పైసలకు కొన్నందుకు మీకు సన్మానాలు చేయాలా . అదానీతో ఒప్పందానికి దేశంలో ఏ రాష్ట్రం ముందుకు రాకుంటే.. ఆగమేఘాల మీద ఒప్పందానికి మీరు ముందుకు వచ్చినందుకు మీకు అవార్డులు ఇవ్వాలా. ట్రాన్స్మిషన్ ఛార్జీల భారం అక్కడ ఇక్కడ లేకుంటే గుజరాత్‌కి ఇచ్చిన రేటు ప్రకారం ఏపీకి రూ 1.99 పైసలకు అదానీ ఎందుకు ఇవ్వలేదు?.. రూ. 2.49 రేటుకు మీరెందుకు ఒప్పుకున్నారు? ట్రాన్స్మిషన్ ఛార్జీలు గరిష్ఠంగా యూనిట్ రూ. 1.70 పైసలు పడతాయని.. మీ హయాంలోనే ఇంధన శాఖ చెప్తుంటే ఎటువంటి ఛార్జీలు లేవని చెప్పే మీ మాటలు శుద్ధ అబద్ధం కాదా? ఒక ముఖ్యమంత్రిని ఒక వ్యాపారవేత్త అధికారికంగా కలిస్తే గోప్యత పాటించడం దేశంలో ఎక్కడైనా ఉందా? దమ్ముంటే జగన్ మోహన్ రెడ్డి సమాధానం చెప్పాలి” అంటూ షర్మిల ప్రశ్నల వర్షం కురిపించారు.

# అమరావతి రాజధాని... ఎవరూ కదల్చకుండా బాబు మాస్టర్ ప్లాన్

అమరావతి,ఏపీకి రాజధాని ఏది అంటే ఏమో అనేలా ఉండేది గత అయిదేళ్ల వైసీపీ ఏలుబడిలో పరిస్థితి. ఇలా ఎందుకు అంటే మూడు రాజధానులు అంటూ నాడు వైసీపీ ప్రభుత్వం చేసిన రాజకీయ విన్యాసం ఆ రేంజిలో ఉంది మరి అంటారు. ఆఖరికి రాజధాని ఏపీకి ఉందా లేదా అన్నది కూడా అర్థం కాకుండా పోయింది. అదొక జోక్ గా కూడా అంతా చెప్పుకునే విషాదంగా మారింది.నిజానికి ఎంతో చరిత్ర కలిగిన ఏపీకి రాజధాని లేకపోవడం దాని మీద కామెంట్స్ అన్నీ అయిదు కోట్ల ఏపీ జనాలను విపరీతంగా బాధించాయి. ఇది విభజన కంటే కూడా అతి పెద్ద గాయంగా మనసులను కలచివేసింది. అందుకే 2024లో వైసీపీకి దిమ్మదిరిగేలా తీర్పు ఇచ్చారు. కూటమికి చరిత్రలో నిలిచిపోయేలా 164 సీట్లను కట్టబెట్టి ఏలుకోమని భారీ చాన్స్ ఇచ్చారు.ఇదిలా ఉంటే 2014లో విభజన ఏపీలో తొలిసారి సీఎం గా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు చాలా దూరదృష్టిలో అమరావతి రాజధాని నిర్మాణానికి తలపెట్టారు. ప్రపంచ రాజధానిగా చేయాలని అనుకున్నారు. గొప్ప గొప్ప డిజైన్లు వేయించారు. నవ నగరాల నిర్మాణం అని కూడా ప్రతిపాదించారు.పేరెన్నిక గన్న ప్రఖ్యాత సంస్థలను అమరావతి రాజధానికి రప్పించి పెట్టుబడులు పెట్టించారు. వారికి భూ కేటాయింపులు చేశారు. అన్నీ అనుకున్నట్లుగా జరిగే ఈ పాటికి అమరావతి ఒక రూపునకూ షేపునకూ వచ్చేది అని అంటున్నారు.అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అమరావతి రాజధానిని కదపాలని చూసింది అన్న విమర్శలు ఎదుర్కొంది. అమరావతిని ఏమీ చేయడం లేదు అది శాసన రాజధానిగా ఉంటుందని వైసీపీ చెప్పినా అక్కడ తట్టెడు మట్టి వేసి ఏదైనా అభివృద్ధి పని తలపెట్టకపోవడంతో పాటు విశాఖను ఎగ్జిక్యూటివ్ కేపిటల్ అంటూ ప్రచారం చేయడం తో కథ రివర్స్ అయింది.పోనీ విశాఖలో ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్ అయినా చేశారా అంటే అదీ లేదు. కర్నూల్ కి హై కోర్టు అన్నారు కానీ అక్కడ కూడా ఏమీ జరగలేదు. ఇలా మూడు ప్రాంతాల ప్రజల మనోభావాలతో వైసీపీ రాజకీయం చేసిందని ప్రత్యర్థి పార్టీలు చేసిన ప్రచారమే జనాగ్రహానికి కారణం కూడా అయింది. మొత్తానికి వైసీపీని ఘోరంగా మూడు ప్రాంతాలలోనూ ఓడించేశారు.ఇక కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తన తొలి ప్రాధాన్యత అమరావతి మీదనే ఉంచింది. అమరావతిలో గత అయిదేళ్ళలో అభివృద్ధి కానరాక అడవి మాదిరిగా అంతా తయారైంది. దాంతో జంగిల్ క్లియరెన్స్ కి అంతా సిద్ధం చేసింది. ఆ పనులు ప్రస్తుతం తుది దశకు




చేరుకున్నాయి.మరో వైపు చూస్తే కేంద్రంలో ఎన్డీయే కూటమి మూడవసారి అధికారంలోకి రావడంలో కీలకమైన పాత్ర పోషించిన టీడీపీ తన పలుకుబడిని ఈ విధంగా వాడుకుని అమరావతికి ప్రపంచ బ్యాంక్ నుంచి 15 వేల కోట్ల నిధులను మంజూరు చేయించుకుంది. మరో వైపు వివిధ ఏజెన్సీల ద్వారా ఇంకో 12 వేల కోట్ల రూపాయలను కూడా నిధులను సేకరిస్తోంది.దాదాపుగా ముప్పయి వేల కోట్ల రూపాయల నిధులతో అమరావతి రాజధానిని 2027 నాటికల్లా ఒక షేప్ కు తీసుకురావాలని టీడీపీ కూటమి తలపోస్తోంది. ఇవన్నీ ఇలా ఉంటే అమరావతి రాజధాని అని కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ అయితే ఇప్పటిరాకా రిలీజ్ చేయలేదు. దాని మీద విశాఖకు చెందిన మాజీ ఐఏఎస్ అధికారి ఒకరు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాశారు.ఇక కూటమి ప్రభుత్వం కూడా ఈ విషయంలో అప్రమత్తంగానే ఉంది. అమరావతి ఏపీకి రాజధని అని గెజిట్ నోటిఫికేషన్ తెచ్చేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. ఎన్డీయే ప్రభుత్వంలో టీడీపీ కూడా ఉన్నందువల్ల బీజేపీ చెవిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విషయం వేశారు అని అంటున్నారు. దానికి కేంద్ర పెద్దలు కూడా సానుకూలంగా స్పందించారు అని అంటున్నారు.డిసెంబర్ నెలాఖరులోగా అమరావతి ఏపీకి రాజధాని అని కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ రిలీజ్ చేస్తుంది. అదే కనుక జరిగితే అమరావతికి అదే అతి పెద్ద రాజముద్ర గా ఉంటుంది అని అంటున్నారు. అమరావతి రాజధానిని ఇక మీద ఎవరు అధికారంలోకి వచ్చినా కదిపేందుకు వీలు ఉండదని అంటున్నారు.ఆ విధంగా గట్టి బిగింపుల తోనే కూటమి ప్రభుత్వం అమరావతిని ఏపీకి శాశ్వత రజాధానిగా చేయబోతోంది.

# ఈసారైనా వస్తారా? తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు వచ్చే గెస్ట్ ఎవరు?



హైదరాబాద్, పవర్‌లో ఉన్నాం. ప్రతీ కార్యక్రమం దద్దరిల్లిపోవాల్సిందే. అందుకు తగ్గట్లుగా అధిష్టానం నుంచి అతిథి వస్తే క్యాడర్‌కు పూనకాలే అని ప్లాన్ చేస్తోందట కాంగ్రెస్ సర్కార్. ఆహ్వానించాం కానీ అగ్రనేతలు వస్తారో రారో..అని డౌట్ పడుతున్నారట నేతలు. రాజీవ్ గాంధీ విగ్రహావిష్కరణకు ఎవరూ రాలే. ఇప్పుడు తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు అయినా..గాంధీ ఫ్యామిలీ నుంచి ఎవరైనా వస్తారా రారా అని ఎదురుచూస్తున్నారట లీడర్లు. సోనియా, రాహుల్‌కు వీలుకాకపోతే..ప్రియాంక గాంధీ వచ్చినా క్యాడర్‌లో ఫుల్ జోష్ వస్తుందని అనుకుంటున్నారట. ఇంతకీ తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు వచ్చే గెస్ట్ ఎవరు?

డిసెంబర్ 9న సోనియా పుట్టిన రోజు..

సెక్రటేరియట్‌లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తోంది రేవంత్ సర్కార్. డిసెంబర్ 9న తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అంటే 10 12 రోజుల్లోనే ప్రోగ్రామ్ ఉంది. ఈ నేపథ్యంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, లేకపోతే రాహుల్ గాంధీలతో ఆవిష్కరింపజేయాలని సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. ఇప్పటికే సోనియా, రాహుల్, ప్రియాంక గాంధీ సహా ఏఐసీసీ ముఖ్యనేతలందరినీ ఆహ్వానించినట్లు తెలుస్తోంది. డిసెంబర్ 9న సోనియా గాంధీ పుట్టిన రోజు కావడం, అదే రోజు తెలంగాణ ఏర్పాటుపై ప్రకటన రావడంతో..ఇప్పుడు తెలంగాణ తల్లి విగ్రహాన్ని కూడా గాంధీ కుటుంబం సభ్యులతో ఆవిష్కరింపజేస్తే సెంటిమెంట్ వర్కవుట్ అవుతుందని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు.

గాంధీ విగ్రహావిష్కరణకు దూరం..

అయితే తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు గాంధీ కుటుంబం నుంచి ఎవరైనా వస్తారా..రారా అన్న డౌట్‌లో ఉన్నారు టీ కాంగ్రెస్ నేతలు. ఎందుకంటే దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహావిష్కరణకు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను ఆహ్వానించినా వాళ్లెవ్వరూ హాజరవ్వలేదు. దీంతో సెక్రటేరియట్ ఎదురుగా రాజీవ్ గాంధీ విగ్రహాన్ని సీఎం రేవంత్ రెడ్డే ఆవిష్కరించారు. గాంధీ కుటుంబానికి చెందిన రాజీవ్ గాంధీ విగ్రహావిష్కరణకు ఆ కుటుంబం నుంచి ఎవ్వరూ రాకపోవడం వెనక మర్మం ఏముందన్న దానిపై..కాంగ్రెస్ నేతలు, పార్టీ క్యాడర్‌లోనూ జోరుగా చర్చ జరిగింది.

ప్రజల్లోకి ఎలాంటి సంకేతాలు వెళ్తాయోనని ఆందోళన..

ఇప్పుడు తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు సోనియా గాంధీ వస్తారా రారా అని కాంగ్రెస్ నేతలు ఎదురు చూస్తున్నారట. సోనియా గాంధీ రాకపోయినా కనీసం రాహుల్ గాంధీ లేదంటే ప్రియాంక గాంధీ అయినా వస్తే బాగుంటుందని అనుకుంటున్నారట. వయనాడ్ నుంచి భారీ మెజార్టీతో గెలిచిన ప్రియాంక వచ్చినా క్యాడర్‌లో జోష్ వస్తుందని భావిస్తున్నారట. ఒకవేళ ఈ సారి తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు కూడా గాంధీ కుటుంబ సభ్యులు ఎవరూ రాకపోతే పార్టీ క్యాడర్‌తో పాటు ప్రజల్లోకి ఎలాంటి సంకేతాలు వెళ్తాయోనని ఆందోళన చెందుతున్నారట కాంగ్రెస్ నేతలు. అందుకే తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు గాంధీ ఫ్యామిలీ నుంచి ఎవరో ఒకరు హాజరయ్యేలా ఒత్తిడి తీసుకొస్తున్నారని తెలుస్తోంది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com